TGTEL/25/A0880

# నమస్తే భారత్

తెలుగు దినపత్రిక

NAMASTHE BHARAT TELUGU DAILY

న్యాయమిత్ర న్యూస్ దినపత్రిక
NYAYAMITHRA NEWS
Vande Bharat
Research & Charitable Trust
నమస్తే భారత్ తెలుగు దినపత్రిక
NAMASTHE BHARAT TELUGU DAILY
Vande Bharat Network
Print & Electronic Media
Flat No. 101, Ushodaya Towers, Shapur Nagar,
IDA Jeedimetla, Hyderabad - 500 055.
E-mail : vandebharatnetwork@gmail.com
Kamadhenu
Vande Bharat Ghoshala
కామధేను
వందే భారత్ గోశాల
9490617666

మల్కాజిగిరి సంపుటి : 01 సంచిక : 04 బుధవారం, ఫిబ్రవరి 04, 2026 , పేజీలు - 08 వెల : 4/-

# అమెరికాతో వాణిజ్య ఒప్పందం

# ఈ శతాబ్దపు అతిపెద్ద డీల్

- ఎన్డీయే ఎంపీలతో సమావేశమైన ప్రధాని నరేంద్ర మోదీ
- అమెరికా, భారత్ వాణిజ్య ఒప్పందం గురించి వివరణ
- అమెరికా వస్తువులపై సున్నా సుంకాలు ఉంటాయన్న ట్రంప్



ఢిల్లీ, ఫిబ్రవరి 03: అమెరికా-భారత్‌ల మధ్య వాణిజ్య ఒప్పందానికి(×అఒఖ్య ఖా ¯తీఖఒవ ఒమ్యశ్రీ) అంగీకారం కుదిరిన సంగతి తెలిసిందే. దీంతో ఇకపై భారత్ నుంచి అమెరికాకు ఎగుమతి అయ్యే వస్తువులపై సుంకాలు 18 శాతానికి తగ్గాయి. ఈ విషయంలో దక్షిణాసియాలోని పొరుగుదేశాల కంటే మన దేశమే పైచేయి సాధించినట్లయింది. బంగ్లాదేశ్, శ్రీలంకపై టారిఫ్‌లు 20 శాతం కాగా.. పాకిస్థాన్‌పై 19 శాతం, చైనాపై 34 శాతం వరకు సుంకాలు ఉన్నాయి. భారత్, అమెరికా మధ్య జరిగిన వాణిజ్య ఒప్పందంపై తాజాగా ప్రధానమంత్రి నరేంద్ర మోదీ కీలక వ్యాఖ్యలు చేశారు.భారత్, అమెరికా మధ్య జరిగిన వాణిజ్య ఒప్పందాన్ని(ట్రేడ్ డీల్) 'ఈ శతాబ్దపు అతిపెద్ద ఒప్పందం'గా ప్రధాని మోదీ అభివర్ణించారు. ఇది అంతర్జాతీయంగా పెరుగుతున్న భారత దేశ ప్రాముఖ్యతను మరింత పెంచుతుందని తెలిపారు. మంగళవారం ఎన్డీఏ పార్లమెంటరీ పార్టీ సమావేశానికి ప్రధాని మోదీ హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. భారత్, అమెరికా మధ్య కుదిరిన ట్రేడ్ డీల్ కారణంగా ఇరు దేశాల పరస్పర సుంకాలు ప్రస్తుతం ఉన్న 25 శాతం నుంచి 18 శాతానికి తగ్గాయని వెల్లడించారు.ప్రపంచ వ్యవహారాల్లో, సమతుల్యతను కాపాడుకోవడంలో భారత దేశ పాత్ర మరింత పెరుగుతుందని ఎన్డీఏ ఎంపీలతో ఆయన అన్నారు. అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ నిర్ణయంతో కొంతమంది తీవ్ర నిరాశకు గురయ్యారని ప్రతిపక్ష పార్టీలను ఉద్దేశిస్తూ ప్రధాని మోదీ హాస్యంగా వ్యాఖ్యానించారు. భారత ఆర్థిక వ్యవస్థ వృద్ధికి, ఎగుమతులు పెరిగేందుకు ఈ ఒప్పందం ఎంతో ఉపకరిస్తుందని ప్రధాని మోదీ వెల్లడించారు. మరోవైపు ఈ సమావేశంలో ఎన్డీఏ ఎంపీలు ప్రధాని నరేంద్ర మోదీని సత్కరించారు.

# మేడారం జాతర విజయవంతం



హైదరాబాద్, ఫిబ్రవరి 03: ములుగు జిల్లాలో ఇటీవల నిర్వహించిన మేడారం జాతర విజయవంతమైందని స్త్రీ, శిశు సంక్షేమ శాఖ మంత్రి సీతక్క తెలిపారు. మంగళవారం సెక్రటేరియట్‌లో విలేకర్లతో మంత్రి సీతక్క ఇష్టాగోష్టిగా మాట్లాడారు. జాతర పనులు, గుడి పనులు సజావుగా జరిగాయని సంతోషం వ్యక్తం చేశారు. కొంత మంది జాతరతోపాటు ఏర్పాట్లపై విష ప్రచారం చేశారంటూ మండిపడ్డారు. ఎక్కడా.. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా జాతర ముగిసిందని పేర్కొన్నారు. ఒక దొంగతనం ఘటనపై కొందరు తప్పుడు ప్రచారం చేశారని వివరించారు. ఒకట్రెండు రోజుల్లో 'తిరుగు జాతర' జరుగుతుందని తెలిపారు.ప్రతిపక్ష పార్టీల నాయకులు సైతం ఈ జాతర ఏర్పాట్లు బాగున్నాయని ప్రశంసించారని మంత్రి సీతక్క వివరించారు. క్లాస్, మాస్‌తోపాటు ఉన్నత స్థాయి వర్గాల వారు సైతం ఈ జాతరకు భారీగా తరలివచ్చారని చెప్పారు. సుమారు రెండున్నర కోట్ల మంది భక్తులు ఈ మేడారం జాతరకు వచ్చినట్లు భావిస్తున్నామన్నారు. వచ్చే జాతర సమయానికి మేడారం పరిసర ప్రాంతాల్లోని రహదారులను వెడల్పు చేసి.. ట్రాఫిక్ జామ్‌లను నివారిస్తామని పేర్కొన్నారు. వచ్చే ఏడాది జరగనున్న గోదావరి పుష్కరాల కోసం ములుగు జిల్లా పరిధిలో పనులపై అధికారులతో సమీక్షిస్తామని ఈ సందర్భంగా మంత్రి సీతక్క స్పష్టం చేశారు.

# రైల్వే హబ్ గా హైదరాబాద్

## పీఎం ఆవాస్ కింద రాష్ట్రానికి 4.30లక్షల ఇళ్లు



హైదరాబాద్ : ప్రజలు ఆశిస్తున్న సుస్థిర ప్రగతికి దోహదపడేలా కేంద్ర బడ్జెట్ ఉందని కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి పేర్కొన్నారు. ఎన్నికల కోసం కాకుండా వికసిత్ భారత్-2047 కోసం పెట్టిన బడ్జెట్ ఇది అని ఆయన వివరించారు. హైదరాబాద్‌లో నిర్వహించిన మీడియా సమావేశంలో బడ్జెట్ సహా పలు అంశాలపై ఆయన మాట్లాడారు. ఉచితాలు ప్రవేశ పెట్టడం కోసమే బడ్జెట్ అన్నట్లుగా రాజకీయ పార్టీలు ప్రజల్లో తప్పుడు ప్రచారం చేస్తున్నాయని ఆగ్రహం వ్యక్తం చేశారు. వీబీ జీ రామ్ జీ పథకాన్ని నిర్వీర్యం చేశారంటూ కాంగ్రెస్ తప్పుడు ప్రచారం చేసిందని మండిపడ్డారు. ఆ పథకానికి బడ్జెట్‌లో 9శాతం అధిక నిధులు కేటాయించారని చెప్పారు. వస్త్ర ఉత్పత్తి పరిశ్రమలకు ఈ బడ్జెట్ ద్వారా లబ్ధి చేకూరుతుందన్నారు.పీఎంఏవై కింద రాష్ట్రానికి 4.30లక్షల ఇళ్లు : ప్రతి జిల్లాకు బాలికల వసతి గృహం రాబోతున్నట్లు కిషన్‌రెడ్డి చెప్పారు. ప్రధానమంత్రి ఆవాస్ యోజన కింద తెలంగాణకు 4.30లక్షల ఇళ్లు కేటాయించామన్నారు. హైదరాబాద్ రైల్వే హబ్ కాబోతుందని వివరించారు. మేడారం జాతరకు కేంద్రం 3.70 కోట్లు కేటాయించిందన్నారు. నైనీ బొగ్గు గనుల వ్యవహారంలో మంత్రులు రెండు వర్గాలుగా విడిపోయారని విమర్శించారు. బీఆర్ఎస్, కాంగ్రెస్ దగా వల్లే సింగరేణి భ్రష్టు పట్టిందని ఆరోపించారు. సింగరేణిని ప్రైవేట్ లిమిటెడ్ కంపెనీగా కేసీఆర్ మార్చుకున్నారని కాంగ్రెస్ అధికారంలోకి వచ్చాక కాంగ్రెస్ ప్రైవేట్ లిమిటెడ్‌గా మార్చుకుందని కిషన్‌రెడ్డి విమర్శించారు.పీఎం ఆవాస్ కింద రాష్ట్రానికి 4.30లక్షల ఇళు సమాజంలోని అన్ని వర్గాల ప్రజలకు మేలు జరిగే విధంగా బడ్జెట్ ప్రవేశపెట్టడం జరిగింది. బడ్జెట్ అంటే ఉచితాలు ప్రవేశపెట్టడమే అనే విధంగా ఆలోచిస్తున్నారు. కానీ ఈ ఏడాది బడ్జెట్ ఎన్నికల కోసం కాకుండా దేశంలోని అన్నివర్గాల ప్రజల సంక్షేమం కోసం, బావితరాల భవిష్యత్ కోసం, 2047లో భారతదేశం ఒక అభివృద్ధి చేసిన దేశంగా పరివర్తన చెందేందుకు వేస్తున్న మరో అడుగు ఈ సంవత్సరం బడ్జెట్. హైదరాబాద్?కు రైల్వే ఉండటం వల్ల పెద్ద ఎత్తున ఉపాధి అవకాశాలు లభిస్తాయి"- కిషన్ రెడ్డి, కేంద్రమంత్రి

## కేబినెట్ నిర్ణయం ఉంటే చాలు

### - గవర్నర్ కోటా ఎమ్మెల్సీల ఎంపికపై సుప్రీంకోర్టు క్లారిటీ



హైదరాబాద్ : తెలంగాణ రాష్ట్రంలో గవర్నర్ కోటా ఎమ్మెల్సీల ఎంపిక విషయంలో సుప్రీంకోర్టు స్పష్టత ఇచ్చింది. ఎమ్మెల్సీల ఎంపికకు అడ్డంకిగా తమ ఉత్తర్వులు లేవని తేల్చి చెప్పింది. గత సంవత్సరం ఆగస్టు 13 నాటి మధ్యంతర ఉత్తర్వుల్లోనే స్పష్టంగా చెప్పామని జస్టిస్ విక్రంనాథ్ ధర్మాసనం తెలిపింది. కేబినెట్ నిర్ణయానికి అనుగుణంగా గవర్నర్ నిర్ణయం తీసుకోవచ్చని స్పష్టం చేసింది. తమ ఎన్నికపై జారీ చేసిన ఉత్తర్వులు ఎత్తివేయాలని అమిర్ అలీ సుప్రీంకోర్టులో వెకేట్ పిటిషన్ వేశారు. అమిర్ అలీ పిటిషన్‌ను దాసోజు శ్రవణ్ వేసిన ప్రధాన పిటిషన్‌తో జత చేస్తూ ఈ మేరకు ఆదేశాలు జారీ చేసింది. తదుపరి విచారణ ధర్మాసనం మార్చి 19కి వాయిదా వేసింది. ఈ తీర్పుతో అజారుద్దీన్, కోదండరాం నియామకానికి దాదాపు అడ్డంకి తొలగినట్లే.

# గురుకులాలు విద్యా నిలయాలా..?

# విషసర్పాలకు ఆవాసాలా..?

- విద్యార్థిని పూర్తి బాధ్యత రేవంత్‌దే : హరీష్ రావు



మహబూబాబాద్ జిలా: ఇంటిగ్రేటెడ్ స్కూళ్ల సంగతి దేవుడెరుగు.. ఉన్న గురుకులాల పరిస్థితి అధ్వాన్నం చేశారని మాజీ మంత్రి హరీష్ రావు ఆరోపించారు. పాము కాటుకు గురై ఆస్పత్రిలో చేరిన గురుకుల విద్యార్థిని ప్రాణానికి పూర్తి బాధ్యత సీఎం రేవంత్ రెడ్డిదేనని అన్నారు. మహబూబాబాద్ జిల్లా ఇనుగుర్తి గురుకులంలో ఇంటర్ విద్యార్థిని అశ్మిత పాముకాటుకు గురై మృత్యువుతో పోరాడుతుందన్న ఘటనపై ఎక్స్ వేదికగా స్పందించారు. విద్యార్థిని పాము కాటుకు గురైన వార్త తనను ఎంతో కలిచివేస్తోందన్నారు. రేవంత్ రెడ్డి గారు మీ పాలనలో గురుకులాలు విద్యా నిలయాలా..? లేదంటే విషసర్పాలకు ఆవాసాలా..? అని హరీష్ రావు ప్రశ్నించారు.సీఎంగా, విద్యాశాఖ మంత్రిగా ఇది మీ పరిపాలనా వైఫల్యం కాదా...? రూ.20 వేల కోట్లతో ఇంటిగ్రేటెడ్ స్కూల్స్ అని చెబుతూ రంగుల లోకం చూపిస్తూ గురుకులాలను మీరు గాలికి వదిలేయడం సిగ్గుచేటన్నారు. గురుకులాల్లో పిచ్చి మొక్కలు తొలగించే దిక్కులేదు. చిమ్మచీకట్లో లైట్లు వేసే నాథుడు లేడు. అపరిశుభ్రత కారణంగా గురుకులాల్లో నేడు కుక్కకాట్లు, పాము కాట్లు సర్వసాధారణంగా మారిపోవడం అత్యంత దుర్మార్గమైన విషయమన్నారు.గురుకుల బిడ్డలకు కడుపునిండా తిండి లేదు.. ప్రాణాలకు రక్షణ లేదన్నారు. సీఎం హార్వర్డ్ యూనివర్సిటీకి వెళ్లి విదేశాల్లో ఫొటోలకు పోజులిస్తే ఇక్కడ పేద విద్యార్థులు ఆస్పత్రి పాలై కొట్టుమిట్టాడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. తమ పిల్లలు చదువుకోవడానికి వెళ్తున్నారా..? లేక చావుతో పోరాడేందుకు వెళ్తున్నారా..? అని తల్లిదండ్రులు ఆవేదన చెందుతున్నారు. ఇప్పటికైనా మొద్దు నిద్ర వీడి పతనమవుతున్న గురుకులాలను కాపాడాలి. రాజకీయ కక్షసాధింపుల మీదున్న శ్రద్ధలో కొంతైనా పేద పిల్లల బతుకుపై పెట్టండని విజ్ఞప్తి చేశారు.

# నిరుద్యోగులను నమ్మించి నయవంచన



హైదరాబాద్, ఫిబ్రవరి 3: ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిపై మాజీ మంత్రి కేటీఆర్ మరోసారి తీవ్ర స్థాయిలో విమర్శలు గుప్పించారు. తెలంగాణ నిరుద్యోగుల ఆగ్రహం కట్టలు తెంచుకుంటోందని అన్నారు. మరో గ్యారెంటీ నుంచి నిస్సిగ్గుగా ముఖం చాటేసిన ముఖ్యమంత్రిని చూసి యువత ఛీకొడుతోందని ఆయన పేర్కొన్నారు. అధికారంలోకి వచ్చిన తొలి ఏడాదే 2 లక్షల ఉద్యోగాలని హామీ అని చెప్పి... ఇప్పుడు ఐదేళ్ల హామీ అంటూ మాటమార్చారంటూ సోషల్ మీడియా ఎక్స్‌లో మాజీ మంత్రి కేటీఆర్ పోస్టు చేశారు.కేటీఆర్ ట్వీట్.మరో గ్యారెంటీ నుంచి నిస్సిగ్గుగా ముఖం చాటేసిన ముఖ్యమంత్రిని చూసి తెలంగాణ నిరుద్యోగుల ఆగ్రహం కట్టలు తెంచుకుంటోందన్నారు. అధికారంలోకి వచ్చిన తొలి ఏడాదే 2 లక్షల ఉద్యోగాలిస్తామని హామీ ఇచ్చి అడ్డదారిలో రేవంత్ గద్దె ఎక్కారన్నారు. ఇప్పుడు అది ఐదేళ్ల హామీ అని, పీసీసీ చీఫ్‌తో సీఎం పలికిస్తున్న చిలుక పలుకులు చూసి యువతరం ఛీకొడుతోందని కేటీఆర్ విమర్శించారు. కేసీఆర్ హయాంలో చివరి దశలో ఉన్న 65 వేల ఉద్యోగాలకు నియామక పత్రాలిచ్చి సీఎం ఫోటోలకు ఫోజు కొట్టారన్నారు. ఆ తర్వాత మొత్తానికే చేతులెత్తేయడంతో తెలంగాణలో 'రిక్రూట్‌మెంట్ జీరో'గా మారిపోయిందని మాజీ మంత్రి విమర్శించారు.జాబ్ క్యాలెండర్‌కు పాతరేసి, వరుస కుంభకోణాలతో రేవంత్ సర్కారు జేబులు నింపుకుంటున్న తీరును తెలంగాణ సమాజం నిత్యం గమనిస్తోందని మాజీ మంత్రి చెప్పారు. తెలంగాణ నిరుద్యోగులను నమ్మించి నయవంచన చేసినందుకు సీఎం ముక్కునేలకు రాసి క్షమాపణలు చెప్పినా క్షమించే ప్రసక్తే లేదని స్పష్టం చేశారు. ఇప్పటికే మూడు దఫాలుగా రైతుబంధు ఎగ్గొట్టి 70 లక్షల మంది అన్నదాతల పొట్టకొట్టారని మండిపడ్డారు. కేసీఆర్ పాలనలో ఆత్మగౌరవంతో బతికిన రైతన్నను మళ్లీ అప్పులపాలు చేసి తీరని ద్రోహం చేశారని విమర్శించారు.సీఎం సీటుపై కూర్చున్న మరుక్షణంలోనే ప్రతి మహిళకు రూ.2500 ఇస్తానని చెప్పిన మాటకు రెండేళ్లయినా ఒక్కరికీ ఇవ్వలేదన్నారు. ఆరు గ్యారెంటీలన్నీ అక్షరాలా గారడీలేనని వ్యాఖ్యలు చేశారు. 420 హామీలన్నీ నయవంచన మాత్రమేనని తన నిజస్వరూపాన్ని బయటపెట్టిన రేవంత్ సర్కారుకు నిరుద్యోగుల ఉసురు తగలడం ఖాయమని హెచ్చరించారు. చైతన్యానికి ప్రతీకైన తెలంగాణ యువత సంఘటిత శక్తిలో ఉన్న బలం ఏంటో, వారు బిగించే పిడికిళ్లు కాంగ్రెస్ పునాదులను ఎలా పెకిలిస్తాయో త్వరలోనే చూస్తామని మాజీ మంత్రి కేటీఆర్ ట్వీట్ చేశారు.


# మంత్రులతో సీఎం రేవంత్‌రెడ్డి భేటీ

## - మున్సిపల్ ఎన్నికలు, రాజకీయ పరిణామాలపై చర్చ



హైదరాబాద్, ఫిబ్రవరి 3: తెలంగాణలో జరగబోయే మున్సిపల్ ఎన్నికలపై సీఎం రేవంత్ కొంతమంది మంత్రులతో త్వజాగా సమావేశమ య్యారు. ఈరోజుతో నామినేషన్ల ఉపసంహరణ ప్రక్రియతో పాటు బీ-ఫాం అందజేత కార్యక్రమాలు కూడా పూర్త య్యాయి. ఇప్పటికే అభ్యర్థుల తరఫున జోరుగా కొనసాగుతున్న ప్రచారం మరింత విస్తృతం కానుంది. 116 మున్సి పాలిటీలకు, 7 కార్పొరే షన్‌లకు ఈ నెల 11వ తేదీన పోలింగ్ జరగనుంది. వారం రోజులపాటు ప్రచారం నిర్వహి ంచుకు నేందుకు అవకాశం ఉండడంతో వ్యూహాలకు అధికార పార్టీ పదును పెడుతోంది.అందులో భాగంగా ఇవాళ పార్లమెంట్ వారీగా ఇంఛార్జిలుగా వ్యవహరిస్తున్న మంత్రులు, సీనియర్ నేతలతో సీఎం రేవంత్ రెడ్డి ప్రత్యేకంగా సమావేశం కావడంతో ప్రాధాన్యత సంతరించుకుంది. ఆయా పార్లమెంటు నియోజకవర్గాల పరిధిలో తాజా రాజకీయ పరిణామాలతో పాటు పార్టీ బలాబలాలు, ప్రచార వ్యూహాలు, అభ్యర్థుల ఎంపిక తదితర అంశాలపై సీఎం రేవంత్ రెడ్డి, పీసీసీ అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్, రాష్ట్ర వ్యవహారాల ఇంఛార్జి మీనాక్షీ నటరాజన్, డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, ఇంఛార్జి మంత్రులు, సీనియర్ నాయకులు చర్చిస్తున్నారు.పార్లమెంటు నియోజక వర్గాల వారీగా తాజా పరిస్థితులపై చర్చ ముగిసిన తరువాత ఆయా మున్సిపాలిటీలల్లో పార్టీ పరంగా అనుస రించాల్సిన వ్యూహాలపై దిశా నిర్దేశం చేయనున్నారు. ఇప్పటికే మున్సిపాలిటీల వారీగా డీసీసీ అధ్యక్షుల నుంచి పీసీసీ నివేదికలు తెప్పించుకుంది. ఆ నివేదికల ఆధారంగా సమీక్ష నిర్వహిస్తున్నట్లు పీసీసీ వర్గాలు వెల్లడించాయి.

# ఎమ్మెల్యే కడియం శ్రీహరి అనర్హత పిటిషన్‌పై విచారణ



హైదరాబాద్, ఫిబ్రవరి 3: తెలంగాణ రాజకీయాల్లో ఆసక్తి రేపుతున్న ఎమ్మెల్యే కడియం శ్రీహరి అనర్హత పిటిషన్‌పై రేపు కీలక అడుగు పడనుంది. ఆయనపై వచ్చిన ఫిర్యాదును అసెంబ్లీ స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్ విచారించనున్నారు. ఉదయం 11 గంటలకు స్పీకర్ తన ఛాంబర్‌లో ఈ విచారణను చేపడతారు.గత అసెంబ్లీ ఎన్నికల్లో స్టేషన్ ఘన్‌పూర్ నియోజకవర్గం నుండి బీఆర్ఎస్ పార్టీ తరపున గెలిచిన కడియం శ్రీహరి, ఆ తర్వాత మారుతున్న రాజకీయ సమీకరణాల వల్ల కాంగ్రెస్ పార్టీలో చేరారు. పార్టీ మారినందుకు గాను ఆయనపై అనర్హత వేటు వేయాలని బీఆర్ఎస్ ఎమ్మెల్యే కేపీ వివేకానంద గౌడ్ స్పీకర్‌కు ఫిర్యాదు చేశారు.ఈ విచారణలో భాగంగా, ఫిర్యాదు చేసిన కేపీ వివేకానంద గౌడ్ వాదనలను స్పీకర్ మొదటగా నమోదు చేస్తారు. కడియం శ్రీహరి పార్టీ మార్పు నిబంధనలకు విరుద్ధంగా ఎలా జరిగిందనే అంశంపై వివేకానంద తన దగ్గర ఉన్న ఆధారాలను స్పీకర్ ముందు ఉంచనున్నారు. ఈ విచారణ తర్వాత స్పీకర్ ఎలాంటి నిర్ణయం తీసుకుంటారో అని రాజకీయ వర్గాల్లో ఉత్కంఠ నెలకొంది.

# కోదండరాంను ఎమ్మెల్యేగా పెద్దల సభకు పంపటం వాళ్లకు ఇష్టం లేదు



**హైదరాబాద్ :** తెలంగాణలో కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన తర్వాత గవర్నర్ కోటాలో ఎమ్మెల్సీలుగా ప్రొఫెసర్ కోదండరాం, అమీర్ అలీ ఖాన్‌లను నామినేట్ చేసిన విషయం తెలిసిందే. అయితే కళలు, సామాజిక, సాహిత్యం, విజ్ఞానశాస్త్రం వంటి రంగాల్లో విశేష కృషి చేసిన వారికే గవర్నర్ కోటా వర్తిస్తుందని.. పొలిటికల్ నేపథ్యం ఉన్నవారికి ఎలా నామినేట్ చేస్తారని బీఆర్ఎస్ నేతలు సుప్రీం కోర్టును ఆశ్రయించిన సంగతి తెలిసిందే. దీంతో సుప్రీం కోర్టు వారి నియామకాన్ని రద్దు చేసింది. తాజాగా.. ఈ ఎపిసోడ్‌పై ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కీలక కామెంట్స్ చేశారు. తెలంగాణ ప్రత్యేక రాష్ట్ర సాధన కోసం అలుపెరుగని పోరాటం చేసిన కోదండరాం వంటి వారిని పెద్దల సభకు పంపటం బీఆర్ఎస్ అధినేత కేసీఆర్, ఆ పార్టీ నేతలకు ఇష్టం లేదని అన్నారు.సోమవారం హైదరాబాద్ బంజారాహిల్స్‌లో 'తెలంగాణ అమరవీరుల స్మారక ట్రస్టు' ఆధ్వర్యంలో రావి నారాయణరెడ్డి జాతీయ అవార్డు-2025ను సుప్రీంకోర్టు రిటైర్డ్ జడ్జి జస్టిస్ సుదర్శన్‌రెడ్డికి సీఎం రేవంత్‌రెడ్డి అవార్డు అందజేశారు. అనంతరం మాట్లాడిన సీఎం... ప్రత్యేక రాష్ట్ర ఆవిర్భావం తర్వాత తెలంగాణలో పదవులన్నీ కేసీఆర్ కుటుంబమే అనుభవించిందని మండిపడ్డారు. వందల ఎకరాల ఫామ్‌హౌస్‌లు, వేల కోట్ల రూపాయల ఆస్తులు వారికి ఎక్కడి నుంచి వచ్చాయని నిలదీశారు. నేరాలు చేస్తాం.. ప్రశ్నించొద్దంటే ఎలా అని ప్రశ్నించారు. ఉద్యమకారులమని వారికి వారే రాసుకుంటున్నారని.. చేసిన తప్పులకు పోలీసులు నోటీసులు ఇస్తే తప్పేంటని నిలదీశారు.ఉద్యమ సమయంలో సర్వం కోల్పోయిన వారు రాష్ట్రంలో ఎంతో మంది ఉన్నారని అన్నారు. కానీ కేసీఆర్ కుటుంబం మాత్రం వందల ఎకరాల ఫామ్‌హౌస్‌లు, రూ.వేల కోట్లు సంపాదించిందని తీవ్ర ఆరోపణలు చేశారు. చేయాల్సిన తప్పులన్నీ చేసిన కేసీఆర్ జాతిపిత ఎలా అవుతారని ప్రశ్నించారు. ప్రజలు తిరస్కరించినపుడే అర్థం చేసుకోవాలని.. ఆ ఓటమిని తెలంగాణ ప్రజలపైనే నెట్టడం ఎంత వరకు సబబు కాదని హితవు పలికారు. ఉద్యమకారులు అని చెప్పుకొనే వారికి.. కోదండరాం ఉద్యమకారుడిగా కనిపించడం లేదా..? అని ప్రశ్నించారు. అన్ని పార్టీలను ఏకం చేసి రాజకీయ ఐకాస ఏర్పాటు చేసిన కోదండరాంను అనాడు తీవ్రంగా అవమానించారని గుర్తు చేసారు. ఇంటి తలుపులు బద్దలు కొట్టి మరీ అరెస్టు చేశారని అన్నారు. కోదండరాంను ఎమ్మెల్సీగా నామినేట్ చేస్తే.. సుప్రీంకోర్టు వరకు వెళ్లి అడ్డుకున్నారని సీఎం రేవంత్ ఆక్షేపించారు.

# ఓటీఆర్‌లో టీజీపీఎస్సీ కీలక సంస్కరణ - అభ్యర్థులూ ఆ వివరాలు వెంటనే అప్‌డేట్ చేసుకోండి



**హైదరాబాద్ :** ప్రభుత్వ ఉద్యోగాల నియామక ప్రక్రియను మరింత వేగవంతం చేసేందుకు తెలంగాణ రాష్ట్ర పబ్లిక్ సర్వీసుల కమిషన్ కీలక సంస్కరణ చేపట్టింది. దరఖాస్తు నుంచి సర్టిఫికెట్ వెరిఫికేషన్ వరకు జాప్యాన్ని తగ్గించడంతో పాటు పారదర్శకతను పెంచనుం ది. దరఖాస్తులో కీలకమైన వన్‌టైమ్ రిజిస్ట్రేషన్ (ఓటీఆర్) చేసు కున్న 31.56 లక్షల మంది తమ ఐడీ సహాయంతో తాజా వివరా లను నవీకరించుకోవాలని (అప్‌డేట్ చేసుకోవాలని) స్పష్టం చేసింది. తాజా వివరాల ఆధారంగానే భవిష్యత్తులో ఉద్యోగ నియా మక పరీక్షకు దరఖాస్తు చేసేందుకు అర్హత లభిస్తుందని వెల్లడించింది. ఈ నెల 25వ తేదీలోగా అభ్యర్థులందరూ అదనపు అర్హతలకు సంబంధించిన ధ్రువపత్రాలను ఓటీఆర్ పోర్టల్‌లో అప్‌లోడ్ చేయాల్సి ఉంటుందని తెలంగాణ పబ్లిక్ సర్వీస్ కమిషన్ ఛైర్మన్ బుర్రా వెంకటేశం తెలిపారు.ధ్రువపత్రాల పరిశీలన సులభ తరం : రాష్ట్రంలో ఎస్సీ వర్గీకరణ ప్రక్రియ పూర్తయింది. ఎస్సీ అభ్యర్థులకు సంబంధించి సబ్?క్యాస్ట్?ల వారీగా గ్రూపులు వచ్చాయి. ఈ నేపథ్యంలో ఆయా అభ్యర్థులు ఓటీఆర్‌లో సవరణ చేయాలంటూ ఇప్పటికే టీజీపీఎస్సీ సమాచారం ఇచ్చింది. వీరితో పాటు మిగతా అభ్యర్థులు కూడా తప్పనిసరిగా అప్‌డేట్ చేయాల్సి ఉంటుందని స్పష్టం చేసింది. గతంలో విద్యార్హతలు, వ్యక్తిగత వివరాలు పేర్కొన్నా, వాటికి ఎలాంటి ఆధారాలు (డాక్యుమెంట్లు) సమర్పించాలని లేదు. తాజాగా అన్ని ఆధారాలను అప్‌లోడ్ చేయాల్సి ఉంటుందని పేర్కొంది. తద్వారా భవిష్యత్తులో ఏదైనా ఒక ఉద్యోగ నియామక ప్రకటనకు వారు అర్హులవుతారా? లేదా? అనేది సాంకేతిక పరిజ్ఞానంతో నిర్ణయించనున్నారని తెలుస్తోంది. దీని ద్వారా రిజల్ట్స్? విడుదలయ్యాక ధ్రువపత్రాల పరిశీలన మరింత సులభతరమవుతుంది. ముందుగానే ఓటీఆర్‌లో వివరాలన్నీ నిక్షిప్తం కావడంతో వాటిని సంబంధిత విశ్వవిద్యాలయాల ద్వారా ముందస్తు పరిశీలన చేపట్టి, వేగంగా నియామక ప్రక్రియలు ముగించేందుకు వీలవుతుందని కమిషన్ వర్గాలు అంచనా వేస్తున్నాయి.సవరణలు ఇలా : ఉద్యోగార్థులందరూ ఓటీఆర్‌లో (వన్?టైమ్ రిజిస్ట్రేషన్?)లో తాజా కలర్ ఫొటోను అప్‌లోడ్ చేయాలి. కొత్త విద్యార్హతలను ఎంటర్ చేయడంతో పాటు ధ్రువపత్రాలు సమర్పించాల్సి ఉంటుంది. ఒకసారి అప్‌డేట్ చేసిన ఓటీఆర్ ఆ అభ్యర్థి లేదా కమిషన్ రద్దు చేసేవరకూ చెల్లుబాటులో ఉంటుంది. ఓటీఆర్‌లో అదనపు అర్హతలు, అడ్రస్, ఈడబ్ల్యూఎస్ (ఎకనామికల్లీ వీకర్ సెక్షన్), నాన్‌క్రిమిలేయర్ కేటగిరీలు, సెల్‌ఫోన్ నంబర్, ఈ-మెయిల్ ఐడీ మినహా ఇతర వివరాలు అప్‌డేట్ చేసేందుకు వీల్లేదు. ఉద్యోగాల భర్తీకి నోటిఫికేషన్లు ఇచ్చేందుకు : రాష్ట్రంలో ప్రభుత్వ ఉద్యోగాల భర్తీకి కొత్త నోటిఫికేషన్లు ఇచ్చేందుకు టీజీపీఎస్సీ కసరత్తు చేస్తోంది. ఇప్పటికే పెండింగ్ ఉద్యోగ నియామకాలన్నీ పూర్తి చేసిన కమిషన్, కొత్తగా గుర్తించిన కొలువులను భర్తీ చేసేందుకు సమాయత్తమవుతోంది. ప్రభుత్వం ప్రకటించిన జాబ్ క్యాలెండర్‌లో భాగంగా తొలుత ఇంజినీరింగ్ సర్వీసులతో నియామక ప్రక్రియను కమిషన్ ప్రారంభించనున్నట్లుగా తెలుస్తోంది. ప్రభుత్వ ఇంజినీరింగ్ విభాగాల్లో గుర్తించిన ఖాళీ పోస్టులన్నీ ముందుగా భర్తీ చేయనుంది. తాజాగా చేపట్టిన ఓటీఆర్ అప్‌డేట్ ముగిసిన అనంతరం నోటిఫికేషన్ విడుదల కానుంది. ప్రభుత్వ విభాగాల నుంచి అందిన ప్రతిపాదనలు, రోస్టర్ ఆధారంగా కమిషన్ ఇప్పటికే పరిపాలన ప్రక్రియ పూర్తి చేసిందని, 500కు పైగా ఇంజినీరింగ్ పోస్టులతో తొలి ప్రకటన విడుదలవ్వనున్నట్లుగా సమాచారం.గ్రూప్-3 ఉద్యోగాలకు ఎంపికైన వారి జాబితా విడుదల : తెలంగాణ గ్రూప్?-3 కొలువులకు ఎంపికైన వారి జాబితాను టీజీపీఎస్సీ కొద్ది రోజుల క్రితం విడుదల చేసింది. ఈ మేరకు 1370 పోస్టులకు అభ్యర్థుల జాబితాను ప్రకటించింది. 2024 డిసెంబరు 17, 18 తేదీల్లో గ్రూప్?-3కి సంబంధించిన పరీక్షలు జరిగాయి. తెలంగాణ రాష్ట్రవ్యాప్తంగా దాదాపు 2.67లక్షల మంది అభ్యర్థులు పరీక్షలకు హాజరైన విషయం తెలిసిందే. గతంలో జనరల్ ర్యాంకింగ్స్, మెరిట్ జాబితాలను విడుదల చేసిన అధికారులు, వెబ్ ఆప్షన్ల నమోదు ప్రకియను చేపట్టారు. అనంతరం అభ్యర్థుల ధ్రువపత్రాల పరిశీలన జరిగింది.

# హైదరాబాద్‌లో ఐటీ ఉద్యోగులకు గుడ్‌న్యూస్ ఆ ప్రాంతంలో కొత్త స్కైవాక్ ట్రాఫిక్ సమస్యలకు చెక్




**హైదరాబాద్:** ఐటీ హబ్‌గా దూసుకెళ్తున్న హైదరాబాద్‌లో రోజు రోజుకూ జనాభా భారీగా పెరిగిపోతోంది. ఐటీ కారిడార్‌లో నిత్యం లక్షల మంది టెకీలు రాకపోకలు సాగిస్తున్నారు. దీంతో ఉదయం, సాయంత్రం ఆ మార్గాల్లో ట్రాఫిక్ జామ్‌లు ఏర్పడుతున్నాయి. ఈ ట్రాఫిక్‌ను తగ్గించేందుకు ప్రభుత్వం.. ఫ్లైఓవర్లు, అండర్‌పాస్‌లు, రోడ్డు విస్తరణ పనులను ఎప్పటికప్పుడు చేపడుతూనే ఉంది. అయినప్పటికీ జనం, వాహనాల రద్దీతో.. నగరంలో జనం ట్రాఫిక్ ఇబ్బందులు పడుతూనే ఉన్నారు. అదే సమయంలో ట్రాఫిక్ సమయంలో పాదచారులు నడిచేందుకు, రోడ్డు దాటేందుకు కూడా చాలా కష్టంగా మారుతోంది. ఈ నేపథ్యంలోనే ప్రభుత్వం రద్దీగా ఉండే కీలక ప్రాంతాల్లో స్కైవాక్‌లను ఏర్పాటు చేస్తోంది. విశాలమైన రోడ్లు దాటలేక ఇబ్బంది పడేవారికి.. ట్రాఫిక్ ఉన్న సమయంలో.. పాదచారులు ఈ స్కైవాక్‌లను ఉపయోగించి.. సులువుగా గమ్యాన్ని చేరుకోవచ్చు.ఇప్పటికే నగరంలోని ప్రధాన కూడళ్లు, కీలక ప్రాంతాల్లో ఏర్పాటు చేసిన స్కైవాక్‌లపై నగరవాసులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. ఈ నేపథ్యంలోనే తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి సంబంధించిన మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్, అర్బన్ డెవలప్‌మెంట్ శాఖ కీలక నిర్ణయం తీసుకుంది. సైబరాబాద్‌లోని రాయదుర్గ్-టీ హబ్ వద్ద కొత్త స్కైవాక్ నిర్మించేందుకు ప్రతిపాదనలు సిద్ధం చేసింది. స్కైవాక్ రెడీ.. ఆ రూట్‌లో ట్రాఫిక్ సమస్యలకు చెక్.. దూసుకెళ్లిపోవచ్చు హైదరాబాద్‌లోని రద్దీగా ఉండే ఐటీ కారిడార్‌లో ట్రాఫిక్ సమస్యలు, పాదచారుల భద్రత, మరింత సౌకర్యంగా నడిచి వెళ్లడం కోసం ఈ స్కైవాక్‌ను నిర్మించనున్నట్లు సంబంధిత వర్గాలు తెలిపాయి. దీనికి సంబంధించి పోలీస్, ట్రాఫిక్ ఉన్నతాధికారులతో సోమవారం (ఫిబ్రవరి 2) రోజున సైబరాబాద్ పోలీస్ కమిషనర్ ఎం రమేష్.. క్షేత్రస్థాయిలో పర్యటించి పర్యవేక్షించారు.హైదరాబాద్‌లో కొత్త స్కైవాక్.. అధునాతన లిఫ్టులు, ఎస్కలేటర్లతో.. ఈ ప్రాంతంలోనే..!ఈ స్కైవాక్.. రాయదుర్గ్ నుంచి ప్రారంభమై మెట్రో స్టేషన్, ఐకియా ఫ్లైఓవర్, ఐటీసీ ఎల్ జంక్షన్ మీదుగా టీ-హబ్ వరకు నిర్మించనున్నారు. మెట్రో ప్రయాణికులు, ఆఫీసులకు వెళ్లే ఉద్యోగులు, నగరవాసులతో కిక్కిరిసిపోయి ఉండే ట్రాఫిక్, పాదచారుల భద్రతను దృష్టిలో ఉంచుకుని.. ఈ స్కైవాక్ ప్రాజెక్టును అధికారులు ప్రతిపాదించారు.ఈ స్కైవాక్ నిర్మాణంతో దాదాపు 30 శాతం ట్రాఫిక్ రద్దీని తగ్గించాలని అధికారులు ప్రణాళికలు వేశారు. సొసైటీ ఫర్ సైబరాబాద్ సెక్యూరిటీ కౌన్సిల్ సహాయంతో ఈ స్కైవాక్ ప్రతిపాదనను అధికారులు రూపొందించారు. ఈ స్కైవాక్ ఫేజ్-1లో భాగంగా 500 మీటర్ల మేర నిర్మించనున్నారు. ఇక టీ-హబ్, మైండ్ స్పేస్ సీ-గేట్‌ను కలుపుతూ 400 మీటర్ల అండర్‌పాస్ నిర్మించేందుకు కూడా ప్రణాళికలు సిద్ధం చేస్తున్నారు.

# మున్సిపల్ ఎన్నికల ఖర్చులపై నిశిత నిఘా




**హనుమకొండ, ఫిబ్రవరి 2 :** మున్సిపల్ ఎన్నికల్లో పోటీకి అభ్యర్థులు దాఖలు చేసిన నామినేషన్లపై అభ్యంతరాల పరిశీలన, పరిష్కారం సోమవారం జరిగింది. మంగళవారం ఉపసంహరణలకు చివరి తేదీ. నేడు మధ్యాహ్నం 3 గంటల తర్వాత పోటీలో ఉన్న అభ్యర్థుల తుది జాబితాను ప్రకటిస్తారు. పోలింగ్ తేదీ ఈనెల 11న(మంగళవారం) నుంచి ఎన్నికల ప్రచారంపై అభ్యర్థులు చేసే ఖర్చు లెక్కింపు అధికారికంగా అమలులోకి వస్తుంది. ఎన్నికల ప్రచారానికి గడువు వారం రోజులే. అభ్యర్థుల ఎన్నికల ప్రచారం ఖర్చు పరిమితి, ఎన్నికల అధికారుల లెక్కింపు ఎలా ఉంటుందో చూద్దాం.ఖర్చు పరిమితిపార్టీ అభ్యర్థి అయినా, స్వతంత్ర అభ్యర్థి అయినా ఇద్దరికీ ఖర్చు పరిమితి ఒకేలా ఉంటుంది. నగర పంచాయతీలకు రూ.2లక్షలు, గ్రేడ్3 మున్సిపాలిటీలకు రూ.3లక్షల వరకు, గ్రేడ్ 2 మున్సిపాలిటీలకు రూ.4లక్షల వరకు, గ్రేడ్1 మున్సిపాలిటీలకు రూ.5లక్షల వరకు అభ్యర్థులు ఖర్చు చేయవచ్చు.వీటిని ఖర్చు కింద లెక్కిస్తారు.ఫ్లెక్సీలు, బ్యానర్లు, వాహనాల అద్దె, మైక్ లేదా డీజే, సభలు, సమావేశాల నిర్వహణ, సో షల్ మీడియా ప్రచారం, కార్యకర్తలకు భోజనాలు, తాగునీరుపై పెట్టిన వ్యయాలన్నిటినీ ఎన్నికల ఖర్చు కిందే లెక్కిస్తారు. పార్టీ చేసిన ఖర్చు కూడా అభ్యర్థి ఖర్చుగానే పరిగణిస్తారు. ప్రతీ అభ్యర్థి తప్పనిసరిగా ఎన్నికల ఖర్చుల రిజిస్టర్ నిర్వహించాలి. ఎన్నికల అధికారికి మధ్యలో, ఎన్నికల తర్వాత 30 రోజులలోపు రిజిస్టర్ తప్పక కూపించాలి.పరిమితి మించితే.ఖర్చుల పరిమితి మించితే ఎన్నిక రద్దయ్యే ప్రమాదం ఉంది. అనర్హత వేసే, భవిష్యత్తు ఎన్నికల్లో పాల్గొనకుండా నిషేధం విధించే అవకాశం ఉంది. ఎన్నికల ఖర్చు విషయంలో పార్టీ అభ్యర్థికి ప్రత్యేక సడలింపు అంటూ ఏమీ ఉండదు. స్వతంత్ర అభ్యర్థికీ అదే పరిమితి వర్తిస్తుంది. అభ్యర్థుల ఖర్చులపై అధికారులు గట్టి నిఘా వేసి ఉంచుతారు. ప్రతీ రూపాయి లెక్కిస్తారు. అయితే అభ్యర్థి అనుమతితో లేదా ఆదేశంతో జరిగిన ప్రతీ ఖర్చు కచ్చితంగా లెక్కలోకి వస్తుంది. పార్టీ చేసింది అన్న కారణం చెప్పి తప్పించుకోలేరు.

# ఉద్యోగాలపై త్వరలో సీఎం భారీ ప్రకటన: కాంగ్రెస్ ఎమ్మెల్సీ ప్రకటన



**హైదరాబాద్, ఫిబ్రవరి 03:** తెలంగాణ అసెంబ్లీ ఎన్నికల్లో బీఆర్ఎస్ పార్టీని ఓడించి.. కాంగ్రెస్ పార్టీని గెలిపించింది నిరుద్యోగులేనని ఎమ్మెల్సీ బల్మూరి వెంకట్ స్పష్టం చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో కొలువుల పండగ ఎలా జరిగిందో తెలంగాణ యువతకి తెలుసునన్నారు. సీఎం రేవంత్ రెడ్డి చేతుల మీదుగా నియామక పత్రాలు ఎందుకు ఇచ్చామంటే యువతకి భరోసా కల్పించేందుకేనని వివరించారు. నోటిఫికేషన్స్ ఇస్తే కొలువు వస్తుందనే భరోసా కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలోనే నిరుద్యోగులకు కల్పించామని చెప్పారు. మంగళవారం నాడు నాంపల్లిలోని గాంధీభవన్‌లో కాంగ్రెస్ ఎమ్మెల్సీ బల్మూరి వెంకట్ విలేకర్లతో మాట్లాడుతూ.. కేటీఆర్ 10 ఏళ్లు అధికారంలో ఉన్నప్పుడు ప్రభుత్వ ఉద్యోగాలను అంగట్లో సరకులు అమ్మినట్టు అమ్మారని విమర్శించారు.10 ఏళ్లలో నిరుద్యోగులను బాధపెట్టిన బీఆర్ఎస్ నేతలు.. ఇప్పుడు సానుభూతి చూపిస్తున్నారంటూ ఆ పార్టీ నాయకులపై మండిపడ్డారు బల్మూరి వెంకట్. వాళ్లకి చిత్తశుద్ధి ఉంటే 10 ఏళ్లలో అమ్ముకున్న ఉద్యోగాలపై స్పష్టత ఇవ్వాలంటూ బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్‌కు ఈ సందర్భంగా ఎమ్మెల్సీ బల్మూరి వెంకట్ సవాల్ విసిరారు. తెలంగాణ రాష్ట్రం.. కేసీఆర్, కేటీఆర్ గడీ కాదన్నారు. తాజాగా టీజీపీఎస్సీ వన్ టైమ్ పాస్ వర్డ్ రిజిస్ట్రార్లు ప్రాసెస్ చేస్తుందని వివరించారు. పోలీస్ శాఖలో రిక్రూట్‌మెంట్ చేస్తామంటూ.. ఇప్పుడు ఎవరిని రెచ్చగొట్టటానికి ప్రయత్నం చేస్తున్నారంటూ కేటీఆర్‌ను కాంగ్రెస్ ఎమ్మెల్సీ సూటిగా ప్రశ్నించారు. ప్రభుత్వ ఉద్యోగాలపై సీఎం రేవంత్ రెడ్డి త్వరలోనే భారీ ప్రకటన చేస్తారని చెప్పారు. తప్పుడు ప్రచారాలను నమ్మకండంటూ యువతకు ఈ సందర్భంగా ఎమ్మెల్సీ బల్మూరి వెంకట్ హితవు పలికారు

# జాబితాలు విడుదల చేసిన కాంగ్రెస్, బీజేపీ

**- అభ్యర్థులకు సమాచారం అందించిన బీఆర్ఎస్**




**కరీంనగర్:** మున్సిపల్ ఎన్నికల్లో పోటీ చేసే అభ్యర్థులు బీఫారం అందించేందుకు మంగళవారం వరకు గడువు ఉంది. దీంతో ప్రధాన పార్టీలు తమ అభ్యర్థులను ఖరారు చేశాయి. కరీంనగర్ కార్పొరేషన్‌లో బీజేపీ, కాంగ్రెస్ తమ అభ్యర్థుల జాబితాలను విడుదల చేశాయి. బీఆర్ఎస్ తమ అభ్యర్థులకు సమాచారం అందించిందని తెలిసింది.ఇక ప్రచారంపై దృష్టి కాంగ్రెస్ పార్టీ స్క్రీనింగ్ కమిటీ రెండు విడతలుగా సమావేశమై అభ్యర్థుల విషయమై చర్చించి పార్టీ రాష్ట్ర నాయకత్వానికి జాబితాను అప్పగించింది. సోమవారం రాత్రి జిల్లా ఇన్‌చార్జి మంత్రి తుమ్మల నాగేశ్వర్‌రావు అభ్యర్థుల జాబితాకు ఆమోదం తెలిపారు. ప్రధాన పార్టీల అభ్యర్థులు ఖరారు కావడంతో ఇక ప్రచారంపై అన్ని పార్టీలు దృష్టి పెట్టనున్నాయి.బీఆర్ఎస్ అభ్యర్థుల ఎంపిక విషయంలో స్థానిక శాసనసభ్యుడు గంగుల కమలాకర్ అన్నీ తానై వ్యవహరిస్తున్నారు. జిల్లా ఇన్‌చార్జిగా మాజీ ఎంపీ బి. వినోద్‌కుమార్ వ్యవహారాలు పర్యవేక్షిస్తున్నారు. పార్టీలో ఒక్కో స్థానంలో ఇద్దరు, ముగ్గురు చొప్పున నామినేషన్లు వేయగా అభ్యర్థుల జాబితాను అధికారికంగా ప్రకటించకుండా నామినేషన్లను వేసిన వారిని పిలిపించి అభ్యర్థి ఎవరో చెబుతూ మిగతా వారిని ఉపసంహరణ కోసం బుజ్జగిస్తున్నారు. ఎంపిక చేసిన వారికి బీఫారం ఇచ్చినట్లు తెలిసింది.ఎంఐఎం పార్టీ కార్పొరేషన్ పరిధిలో బలమైన శక్తిగా ఉంది. ఆ పార్టీ ఇప్పటికే నలుగురు అభ్యర్థులను ఎంపిక చేసి బీఫారాలు అందజేసింది. మిగతావారి వివరాలను మంగళవారం వెల్లడించే అవకాశముంది.బీజేపీ తన అభ్యర్థుల జాబితాను అధికారికంగా ప్రకటించింది. జిల్లా నుంచి త్రిసభ్య కమిటీ పార్టీ నిర్వహించిన సర్వేల ఆధారంగా 66 మంది అభ్యర్థుల జాబితాను రూపొందించింది. ఈ జాబితాను పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు రాంచందర్‌రావు ఖరారు చేశారు. కేంద్ర హోం శాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్ ప్రచారానికి సోమవారం శ్రీకారం చుట్టారు.

# ప్రాణాలతో చెలగాటం వద్దు హైదరాబాద్ సీపీ సజ్జనార్ వార్నింగ్



**హైదరాబాద్ :** సోషల్ మీడియాలో పాప్యులారిటీ కోసం పాకులాడుతున్న నేటి యువత ప్రాణాలతో చెలగాట మాడుతున్నా మనే విషయాన్ని కూడా గుర్తించలేకపోతోంది. ఇందుకు ఎన్నో ఉదాహరణలు నెట్టింట కుప్పలు తెప్పలుగా ఉన్నాయి. అయితే మూర్ఖత్వానికి పరాకాష్టగా నిలిచిన ఓ యువకుడి వీడియోను హైదరాబాద్ సీపీ సజ్జనార్ తాజాగా నెట్టింట పంచుకున్నారు. ఇలాంటి పనులు చేసి ప్రాణాల మీదకు తెచ్చుకోవద్దని హెచ్చరించారు.వీడియోలో కనిపించిన దాని ప్రకారం, రైలు వచ్చే ముందు ఓ యువకుడు పట్టాలపై నిలబడ్డాడు. సరిగ్గా రైలు వస్తోందనంగా అతడు పట్టాల మధ్యలో బోర్లా పడుకున్నాడు. రైలు తనకు తగలకుండా కింద పడుకుని అత్యంత ప్రమాదకరంగా స్టంట్ చేశాడు. అదృష్టవశాత్తూ పట్టాల మధ్య ఉన్న అతడికి తగలకుండానే రైలు పైనుంచి వెళ్లిపోయింది. ఆ తరువాత మెల్లగా లేచిన అతడు ఏదో ఘనకార్యం చేసినట్టు చేతులను పైకి లేపి గట్టిగా అరిచాడు. ఇక అక్కడే ఉన్న అతడి స్నేహితులు కూడా అరపులు, కేకలతో యువకుడిని ప్రోత్సహించారు.ఈ వీడియోను షేర్ చేసిన సీపీ సజ్జనార్ వైరల్ మోజులో పడి కొట్టుకుపోతున్న యువతను ప్రమాదాలను కొనితెచ్చుకోవద్దని హెచ్చరించారు. వైరల్ పిచ్చితో ఇలాంటి పనులు చేయడం సాహసం అనిపించుకోదని హితవు పలికారు. ఇది మూర్ఖత్వానికి పరాకాష్ట అని తేల్చి చెప్పారు. ఒక్క సెకెను తేడా జరిగినా ప్రాణాలు గాల్లో కలిసిపోతాయని గట్టి వార్నింగ్ ఇచ్చారు.ఇక వీడియోపై జనాలు కూడా పెద్ద ఎత్తున స్పందిస్తున్నారు. కట్టుతప్పుతున్న యువతకు చట్టప్రకారం గట్టిగా బుద్ధి చెబితే ఇలాంటి ఉదంతాలకు అడ్డుకట్ట పడుతుందని అన్నారు.

# ఎన్నికల కోడ్‌ను గాలికొదిలేసి




**మక్తల్, ఫిబ్రవరి 03 :** మున్సిపల్ సాధారణ ఎన్నికలలో భాగంగా అభ్యర్థులు బీ ఫామ్స్ ఎన్నికల రిటర్నింగ్ అధికారికి అందజేస్తున్న క్రమంలో కాంగ్రెస్, బీజేపీ పార్టీల నాయకులు ఎన్నికల కోడ్‌ను ఉల్లంఘిస్తూ పోటాపోటీగా నినాదాలు చేశారు. ఈ సంఘటన మంగళవారం మక్తల్ మున్సిపల్ కార్యాలయం ముందు చోటుచేసుకుంది.వివరాలలోకి వెళ్తే.. మున్సిపల్ రెండవ సాధారణ ఎన్నికల్లో భాగంగా మంగళవారం ఉదయం మక్తల్ మున్సిపల్ కార్యాలయంలో కాంగ్రెస్ పార్టీ, బీజేపీ పార్టీలకు చెందిన 16 వార్డులలో ఎన్నికల బరిలో నిలిచినటువంటి, అభ్యర్థులు బీ ఫామ్స్ అందజేయడం కోసం మున్సిపల్ కార్యాలయానికి చేరుకున్నారు. బీ ఫామ్స్ అందజేసిన అనంతరం కాంగ్రెస్ పార్టీ నాయకులు మున్సిపల్ కార్యాలయం ముందే కాంగ్రెస్ నినాదాలు చేస్తూ కోడ్‌ను ఉల్లంఘించారు. కాంగ్రెస్ పార్టీ నాయకుల తరహాలోనే బీజేపీకి చెందిన నాయకులు, ఎన్నికల పోటీల్లో నిలిచినటువంటి అభ్యర్థులు సైతం బీజేపీ నినాదాలు చేస్తూ భారత ప్రధాని నరేంద్ర మోదీ నాయకత్వం వర్ధిల్లాలి అంటూ నినాదాలు చేశారు.ఎన్నికల నిబంధనలకు విరుద్ధంగా.రెండు రాజకీయ పార్టీలకు చెందిన నాయకులు, తమ పార్టీ అభ్యర్థులతోపాటు మున్సిపల్ కార్యాలయం ముందు భారీ ఎత్తున రాజకీయ పార్టీ నినాదాలు చేస్తుంటే, వారిని నివారించాల్సిన మున్సిపల్ ఎన్నికల కార్యాలయ సిబ్బంది అటువైపు కన్నెత్తి చూడకపోవడం, తీవ్ర విమర్శలకు దారి తీసింది. బీఫామ్ అందజేయడానికి వచ్చిన అభ్యర్థితోపాటు, ఒకరిని అనుమతించాల్సి ఉండగా, ఇవేవీ పట్టించుకోకుండా ఒక్కసారిగా కాంగ్రెస్, బీజేపీ పార్టీలకు చెందిన నాయకులు పెద్ద సంఖ్యలో మున్సిపల్ కార్యాలయంలోకి వచ్చి, అభ్యర్థుల వెంబడి కార్యాలయంలో గుమి కూడడంతోపాటు, ఎన్నికల నిబంధనలకు విరుద్ధంగా, రాజకీయ పార్టీ స్లోగన్స్ చేస్తున్నా సరే నివారించడంలో మున్సిప౯ల్ ఎన్నికల అధికారులు ఎలాంటి చర్యలు చేపట్టలేదు. దీన్నిబట్టి మున్సిపల్ ఎన్నికల అధికారులు సైతం పార్టీ, బీజేపీ పార్టీ నాయకులకు వత్తాసు పలుకుతున్నారని, విమర్శలు వెల్లువెత్తాయి.

# భద్రకాళి అమ్మవారిని దర్శించుకున్న పవన్ సతీమణి



**వరంగల్, ఫిబ్రవరి 03:** ఆంధ్రప్రదేశ్ డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ సతీమణి అన్నా లెజినోవా.. వరంగల్ భద్రకాళి అమ్మవారిని దర్శించుకున్నారు. మంగళవారం నాడు ఆలయానికి విచ్చేసిన అన్నా లెజినోవాకు ఆలయ అధికారులు స్వాగతం పలికారు. దేవాలయంలో తొలుత ఆదిశంకరాచార్యులు, వల్లభ గణపతిని ఆమె దర్శించుకున్నారు. అనంతరం అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆ తర్వాత ఆలయంలోని మండపంలో అన్నా లెజినోవాకు అర్చకులు, వేదపండితులు ఆశీర్వచనం పలికి.. అమ్మవారి తీర్థ ప్రసాదాలను అందజేశారు.

మల్కాజిగిరి
Volume : 1
Issue No : 1
బుధవారం,
ఫిబ్రవరి 04, 2026
నమస్తే భారత్
తెలుగు దినపత్రిక
NAMASTHE BHARAT TELUGU DAILY


# ఎపిలో కల్తీ నెయ్యి మంటలు !

తిరుమల కల్తీ నెయ్యి రాజకీయంతో ఆంధ్రప్రదేశ్ రాజకీయాలు పరాకాష్టకు చేరాయి. విమర్శలు, ప్రతి విమర్శలు కాస్తా దాడుల వరకు పోయాయి. పరస్పర విమర్శలు కూడా హద్దులు దాటాయి. ఇళ్లను తగులబెట్టడం, ఇళ్లపై దాడులు చేయడం వంటి దారుణాలు చూస్తున్నాం. ఇంతకన్నా దారుణం మరోటి ఉండదు. వైకాపా ప్రభుత్వ హయాంలో ఇలాంటివి చూశాం. ఇప్పుడు చంద్రబాబు పాలనలోనూ ఇలాంటివి చోటు చేసుకోవడం సిగ్గుచేటు. రాజకీయంగా ఎన్ని విమర్శలు చేసినా ఫరవాలేదు. కానీ దాడులకు తెగించడం మాత్రం సరికాదు. జోగిరమేశ్ ఇంటిపై పెట్రో బాంబు విసిరి తగులబెట్టే యత్నం చేయడం వాంఛనీయం కాదు. అలాగే అంబటి రాంబాబు ఇంటిపైనా దాడిచేసి కారును, ఫర్నీచర్‌ను ధ్వంసం చేశారు. గతంలో నెల్లూరు జిల్లాలో నల్లపురెడ్డి ప్రసన్నకుమార్ రెడ్డి ఇంటిపైనా దాడికి తెగించారు. ఇదంతా ప్రజాస్వామ్యంలో వాంఛనీయం కాదు. ఇలాంటి దాడులతో ఏం సందేశం ఇవ్వాలనుకుంటున్నారో కూటమి నేతలు చెప్పాలి. ఓ రకంగా చెప్పాలంటే తిరుమల లడ్డూకు సంబంధించి కల్తీనెయ్యి సరఫరా వ్యవహారంలో తాజాగా సిబిఐ ఇచ్చిన నివేదక ఆజ్యం పోసిందని చెప్పాలి. కల్తీ జరగలేదని సిబిఐ చెప్పినట్లుగా వైసిపి నేతలు చేస్తున్న ప్రచారం కూడా పరాకాష్టకు చేరింది. తిరుమల దేవదేవుడిని మోసం చేయడంలో అందరూ ముందున్నారు. తిరుమల శ్రీవారిని దోచుకునేందుకు అందరూ ప్రయత్నించారు. దేవుడి డబ్బుపై కన్ను పడిన వైకాపా అక్కడ చేయని ఘోరం లేదు. ఇకపోతే కల్తీనెయ్యిపై విచారణ సాగుతోంది. సిట్ అన్నింటిని పరిగణించి దర్యాప్తు చేస్తోంది. తాజాగా ఇవో అనిల్ కుమార్ సింఘాల్‌ను కూడా బదిలీ చేశారు. అయితే ఈ వ్యవహారంలో పరస్పర దూషణలు, దాడుల వరకూ వెళుతున్న తీరు మాత్రం సభ్యసమాజం సిగ్గుపేడేలా చేసింది. అసలు కల్తీ తీవ్రతపైన సిబిఐ వెల్లడించిన విస్తృతాంశాలను వదిలేసి ఒక్క అంశమే తీసుకుని తాము నిర్దోషులమని చెప్పుకోవడానికి వైసిపి నేతలు రెచ్చిపోయి చేసిన వ్యాఖ్యలు వివాదానికి దారి తీసిందని చెప్పాలి. అలాగే మాజీ సిఎం జగన్ కూడా తిరుమల వ్యవహారాన్ని చాలా చిన్నదిగా చేసి మాట్లాడిన తీరు కూడా సగటు భక్తుడి మనోభావాన్ని దెబ్బతీసింది. ఈ రెండు పార్టీల కుమ్ములాటల్లో ప్రజాసమస్యలన్నీ పక్కదోవ పట్టడం రోజూ చూస్తున్నాం. రాష్ట్రంలో ఎవరు అధికారంలో వున్నా అవినీతి ఆరోపణలు వస్తున్నాయి. ఇది సహజంగా మారింది. కానీ కల్తీ నెయ్యి అంశం మాత్రం భక్తుల మనోభావాలను దెబ్బతీసిందన్నది నిజం. వేలకోట్లకు అధిపతిగా ఉన్న దేవదేవుడి లడ్డూ ప్రసాందం కల్తీనెయ్యితో తయార య్యిందన్న వార్త ఇప్పటికీ జీర్ణించుకోలేనిదిగా మారింది. గతంలో ఆనాటి ప్రధానార్యకులు రమణదీక్షితులు పింక్ డైమండ్లు మాయం అయ్యాయని అన్నారు. ఆలయ భూములు, పూజా పద్ధతులు, నియామకాలతో సహా చాలా సమస్యలు వివాదం అయ్యాయి. వైకాపా హయాంలో తిరుమల పవిత్రతను దెబ్బతీయడం వంటి ఆరోపణలు ముందుకొచ్చాయి. 2024 మేలో చంద్రబాబు ప్రభుత్వం ఏర్పడిన తర్వాత ముఖ్యమంత్రి తొలిసారి తిరుమల సందర్శనలోనే అన్నీ ప్రక్షాళన చేస్తానని ప్రకటించారు. ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్‌గా శ్యామలరావును నియమించారు. ఆ తరవాత తిరుమల లడ్డూ కోసం ఉపయోగించే నెయ్యిలో 'జంతువుల కొవ్వును వాడే పరిస్థితికి వచ్చారని' ఆరోపించడంతో దుమారం చెలరేగింది. జంతువుల కొవ్వు, పంది కొవ్వు కలిసినట్టు తేలిందని ప్రకటించడమేగాక టిటిడి అధికారులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. దానిపై ప్రభుత్వం సిట్‌ను నియమించడం, నెలాఖరుకల్లా సిట్ రంగంలోకి దిగి దర్యాప్తు మొదలెట్టడం జరిగి పోయాయి. ఈ క్రమంలో మాజీ చైర్మన్ వై.వి.సుబ్బారెడ్డి చంద్రబాబు నియమించిన సిట్‌తో కాకుండా సిబిఐ విచారణ జరిపించాలని కోరుతూ సుప్రీం కోర్టులో కేసు వేశారు. విచారణ జరిపిన సుప్రీం కోర్టు ఏ దర్యాప్తు లేకుండా లడ్డూలో కొవ్వు కలిసిందని ఆరోపించి భక్తుల మనోభావాలను దెబ్బ తీయడమేమిటని తీవ్రంగా ఆక్షేపించింది. దేవుడిని





రాజకీయాల్లోకి లాగవద్దని హితవు చెప్పింది. సిబిఐ మొత్తం 12 రాష్ట్రాల్లో అనేక మందిని విచారించింది. ఛార్జిషీటులో 36 మందిని నిందితులుగా పేర్కొంది. ఉత్తరాఖండ్‌లోని భోలే బాబా డెయిరీ నడిపే విపిన్ జైన్, పోమిల్ జైన్‌లను ప్రధాన కారకులుగా తేల్చింది. మొత్తం మీద రాజకీయంగా పాలక పార్టీలు ఏవైనా కొండ మీద అవినీతి సాగుతున్నదని దీన్నిబట్టి తెలుస్తున్నది. నెయ్యిలో భారీగా కల్తీ జరిగిందని, అసలది నెయ్యి కాదని తేల్చి చెబుతూనే కొవ్వు కలిపారనడానికి ఆధారం లేదని సిబిఐ నిర్ధారించడంతో యుద్ధం మొదలయ్యింది. తాము పరిశీలించిన నమూనాలలో నిజమైన నెయ్యి చాలా తక్కువగా వుందనీ, పామాయిల్, పామ్‌స్టెరైన్, ఇతర కృత్రిమ పదార్థాలు రసాయనాలు కలిపారని స్పష్టం చేసింది. కొవ్వు కలిపినట్టు చెప్పే అవకాశాలు దాదాపు లేవని, పంది కొవ్వు కలిపిన ఛాయలు అసలే లేవని పేర్కొంది. భోలే బాబా డెయిరీ పాలు, నెయ్యి సేకరించిన దాఖలాలే లేవనీ, మొత్తం కల్తీ కృత్రిమ నెయ్యి తతంగమేనని దీంతో స్పష్టమయ్యింది. ఇదే తమకు అనుకూలంగా తీర్పు వచ్చిందన్న రీతిలో ఎగిరి గంతేసిన వైసిపి నేతలైతే జగన్‌తో సహా తమ తప్పే లేనట్టు మాట్లాడుతున్నారు. ప్రాయశ్చిత్త హోమాలు, ఆలయ సందర్శనలు చేపట్టారు. ఫ్లెక్సీల పంచాయితీలు తిట్ల స్థాయికి దిగజారుతున్నాయి. నెయ్యిలో కొవ్వు లేదన్నది నిజమేగానీ, అందులో రసాయనాలు కలిపి నెయ్యి పేరిట 200 కోట్ల రూపాయల పైన సరఫరా చేయడం మాత్రం నిజం అన్నది ఇక్కడ గమనించాలి. కల్తీ జరిగిందన్నది కూడా నిజం. ఎవరు అధికారంలో ఉన్నా తిరుమలలో దారుణాలు సాగుతున్నాయి. అయితే ఇవన్నీ రాజకీయ విమర్శలను పరాకష్టకు చేర్చాయి. చివరాఖరుకు దాడుల వరకు వెళ్లాయి. ఇలాంటివి జరగడం సరికాదు. రేపు మరోకరు అధికారం లోకి వస్తే మరిన్ని దాడులు జరగవని చెప్పలేం. అందువల్ల ఇలాంటి దాడి రాజకీయాలను తిప్పి కొట్టాల్సిందే. ప్రజలు ఇలాంటి వారిపట్ల అప్రమత్తంగా ఉండాలి.

---

## జీవన్ రెడ్డి వర్గీయులకు మొండిచేయి

**జగిత్యాలలో ఎమ్మెల్యే సంజయ్ అనుచరులకు పెద్దపీట**

**కాంగ్రెస్ తీరుతో మరోమారు తీవ్ర అసంతృప్తిలో జీవన్ రెడ్డి**

**జగిత్యాల,ఫిబ్రవరి 3:** జగిత్యాల జిల్లాలో మున్సిపల్ టిక్కెట్ల కేటాయింపు స్థానిక ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్ కనున్నల్లోనే కేటాయించారు. ఆయన సూచించిన వారికే టిక్కెట్లు దక్కాయి. దీంతో కాంగ్రెస్ సీనియర్ నేత జీవన్ రెడ్డి మోమారు తీవ్ర అసంతృప్తితో రగిలిపోతున్నారు. ఈ క్రమంలో మాజీ మంత్రి జీవన్ రెడ్డి మున్సిపల్ ఎన్నికల టికెట్ల పంపిణీ విషయంలో తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేసినట్లు సమాచారం. సీట్ల పంపకంలో.. తన గొంతు కోశారని, కాంగ్రెస్ అధిష్ఠానం తన వర్గానికి న్యాయం చేయలేదని అనుచరుల ఎదుట ఆవేదన వ్యక్తం చేసినట్టు తెలుస్తోంది. జగిత్యాల మున్సిపాలిటీలో మొత్తం 50 వార్డులు ఉండగా.. 29 టికెట్లు ఎమ్మెల్యే ఎం.సంజయ్ కుమార్ వర్గానికి, 21 టికెట్లు జీవన్ రెడ్డి వర్గానికి పార్టీ అధిష్ఠానం కేటాయించి నట్లు సమాచారం. ఈ అంశం జీవన్ రెడ్డి వర్గంలో మరింత అసంతృప్తిని పెంచినట్లు తెలుస్తోంది. మరోవైపు ఏడాదిన్నర కాలంగా సంజయ్ కుమార్, జీవన్ రెడ్డి మధ్య విభేదాలు కొనసాగుతున్న విషయం తెలిసిందే. బీఆర్ఎస్ నుంచి కాంగ్రెస్‌లోకి వచ్చిన సంజయ్‌కు పార్టీలో ప్రాధాన్యం ఇవ్వడంపై జీవన్ రెడ్డి గతంలోనే ఘాటుగా విమర్శించారు. ఇప్పుడు టికెట్ల అంశంతో ఆ విభేదాలు మరింత ముదిరినట్టు తెలుస్తోంది.



మున్సిపాలిటీ టికెట్ల కేటాయింపులో జీవన్ రెడ్డి రియాక్షన్‌పై జిల్లాలో ఉత్కంఠ నెలకొంది. ఈ క్రమంలో ఎమ్మెల్యే సంజయ్ కుమార్ క్యాంప్ ఆఫీస్ వద్ద భద్రతా ఏర్పాట్లు పెంచారు పోలీసులు. కాంగ్రెస్ పార్టీలో జీవన్ రెడ్డి భవిష్యత్తు క్లైమాక్స్‌కు చేరుకుందనే చర్చలు జోరుగా వినిపిస్తున్నాయి.

## సీఆర్‌పై కడుపులో కత్తులు, నోటిలో విషం

**రేవంత్ రెడ్డి విమర్శలపై మండిపడ్డ హరీష్ రావు**

**హైదరాబాద్,ఫిబ్రవరి 3:** కేసీఆర్‌పై కడుపులో కత్తులు, నోటిలో విషం పెట్టుకున్న రేవంత్ రెడ్డి తన అజీర్తిని, అక్కసును మరోసారి బయటపెట్టారని మాజీ మంత్రి, బీఆర్ఎస్ ఎల్పీ ఉపనేత హరీష్ రావు మండిపడ్డారు.హేట్ స్పీచ్ అంటే ఏమిటో చెప్పడానికి పుస్తకాలు అవసరం లేదు.. రేవంత్ రెడ్డి ప్రసంగాలు చాలు. అమెరికా వెళ్లి హార్వర్డ్ లో నాలుగు రోజులు చదువుకున్నా.. రేవంత్ రెడ్డి తన వెనకటి గుణం మాత్రం మార్చుకోలేదు. కనీస సంస్కారం రాలేదు. చిల్లర మాటల్లో, వెకిలి చేతల్లో ఎలాంటి మార్పు రాలేదన్నారుహైదరాబాద్‌లో జరిగిన రావి నారాయణ రెడ్డి జాతీయ అవార్డుల ప్రదానోత్సవ కార్యక్రమంలో జస్టిస్ సుదర్శన్ రెడ్డి హేట్ స్పీచ్‌పై హితబోధ చేసిన కొద్ది నిమిషాలు కూడా గడవకముందే, అదే వేదికపై రేవంత్ రెడ్డి తన అసలు స్వభావాన్ని, తన మాటల ద్వారానే బయటపెట్టుకున్నారని హరీష్ రావు ధ్వజమెత్తారు. హేట్ స్పీచ్‌పై ఉపన్యాసం ముగియకముందే, రేవంత్ రెడ్డి హేట్ స్పీచ్‌కు లైవ్ డెమో ఇచ్చారు. విద్వేష రాజకీయాలకు, నరంలేని నాలుకతో విషం చిమ్మే కుసంస్కారానికి నిలువెత్తు నిదర్శనం రేవంత్ రెడ్డి అంటూ విమర్శించారు. దేశానికి గాంధీ జాతిపిత అయినట్లే, తెలంగాణను సాధించిన కేసీఆర్ జాతి పితనే. రేవంత్ రెడ్డినాలుగు కోట్ల ప్రజలు ఏకమై స్వరాష్ట్రం కోసం కొట్లాడుతుంటే ఆంధ్రా పాలకుల బూట్లు తుడుస్తున్న నీకు కేసీఆర్ గురించి, తెలంగాణ ఉద్యమం గురించి ఎలా తెలుస్తుందన్నారు.



ఉద్యమకారుల పైకి తుపాకి ఎక్కుపెట్టిన నీకు ఉద్యమకారుల గురించి మాట్లాడే హక్కు ఉందా రేవంత్ రెడ్డి అని హరీష్ రావు ప్రశ్నించారు. ప్రశ్నిస్తే, నిలదీస్తే అరెస్టులు, కేసులతో నిరంకుశంగా వ్యవహరిస్తున్న నీకు ప్రజాస్వామ్య విలువల గురించి మాట్లాడే హక్కు ఉందా.. రేవంత్ రెడ్డి అని ఘాటు విమర్శలు చేశారు. అధికారాన్ని ప్రజల బాగు కోసం కాకుండా, ప్రతిపక్షాలపై రాజకీయ కక్షల కోసం వినియోగిస్తున్న నీకు అధికార దుర్వినియోగం గురించి మాట్లాడే హక్కు ఉందా.. రేవంత్ రెడ్డి అన్నారు. లక్కీ లాటరీలో ముఖ్యమంత్రి అయిన నీకు ఇవన్నీ ఎలా తెలుస్తాయి..? ఎలా అర్థం అవుతాయి రేవంత్ ? నువ్వు అమెరికా లోని హార్వర్డ్ వెళ్లినా, అంతరిక్షం వెళ్లినా నీ చెత్త బుద్ధి మారదు, నోటి మురికిపోదు అన్నది సుస్పష్టమైందని హరీష్ రావు ఎద్దేవా చేశారు.

## మున్సిపల్ ఎన్నికల్లో జమాఖర్చులపై నిఘా

**•ప్రతిపైసనూ**

**లెక్కించనున్న అధికారులు**

**నిజామాబాద్,ఫిబ్రవరి 3:** మున్సిపల్ ఎన్నికల్లో పోటీకి అభ్యర్థులు దాఖలు చేసిన నామినేషన్లపై అభ్యంతరాల పరిశీలన, పరిష్కారం సోమవారం జరిగింది. మంగళవారం ఉపసంహరణలకు చివరి తేదీ కావడంతో ఎవరు బరిలో ఉన్నారన్నది ప్రకటించనున్నారు. పోలింగ్ ఈనెల 11న జరుగనుండగా మంగళవారం నుంచి ఎన్నికల ప్రచారంపై అభ్యర్థులు చేసే ఖర్చు లెక్కింపు అధికారికంగా అమలులోకి వస్తుంది. ఎన్నికల ఖర్చును నిశితంగా తనఖీ చేస్తారన్న విషయాన్ని ప్రతీ అభ్యర్థి గుర్తుంచుకోవాలని అధికారులు సూచించారు. ఖర్చు రిజిస్టర్‌ను నిర్వ హిస్తున్నారా? ప్రతీ ఖర్చుకు బిల్ లేదా రశీదు ఉందా? ఖర్చు పరిమితి దాటిందా? పార్టీ చేసిన ఖర్చు మీ ఖర్చులో చూపించారా?, సోషల్ మీడియా ఖర్చు చేపించారా? ప్రచారానికి ఎన్ని వాహనాలు వాడుతున్నారు? అనుమతి తీసుకున్నారా? వాహనాలపై ఫ్లెక్సీలు అనుమతి మేరకే ఉన్నాయా? ర్యాలీలు, రోడ్ షోలు అనుమతి తీసుకున్నారా? తదితర వాటిని తనిఖీ చేస్తారు. కనుక మున్సిపల్ ఎన్నికల్లో పోటీ చేసే అభ్యర్థులు ఎన్నికల ప్రచారం సందర్భంగా ఎన్నికల సంఘం నిర్దేశిరచిన నియమ నిబంధనలను తూ.చ. తప్పక పాటించాల్సి ఉంటుందని హెచ్చరించారు. ఎన్నికల ప్రచారానికి గడువు వారం రోజులే ఉండడంతో బరిలో నిలిచన అభ్యర్థులు హైరానా పడుతున్నారు. మరోవైపు అభ్యర్థుల ఎన్నికల ప్రచారం ఖర్చు పరిమితిపై ఎన్నికల అధికారులు లెక్కింపు చేపట్టనున్నారు. పార్టీ అభ్యర్థి అయినా, స్వతంత్ర అభ్యర్థి అయినా ఇద్దరికీ ఖర్చు పరిమితి ఒకేలా ఉంటుంది. నగర పంచాయతీలకు రూ.2లక్షలు, గ్రేడ్3 మున్సిపాలిటీలకు రూ.3లక్షల వరకు, గ్రేడ్ 2 మున్సిపాలిటీలకు రూ.4లక్షల వరకు, గ్రేడ్1 మున్సిపాలిటీలకు రూ.5లక్షల వరకు అభ్యర్థులు ఖర్చు చేయవచ్చు. ఫ్లెక్సీలు, బ్యానర్లు, వాహనాల అద్దె, మైక్ లేదా డీజే, సభలు, సమావేశాల నిర్వహణ, సో షల్ మీడియా ప్రచారం, కార్యకర్తలకు భోజనాలు, తాగునీరుపై పెట్టిన వ్యయాలన్నిటినీ ఎన్నికల ఖర్చు కిందే లెక్కిస్తారు. పార్టీ చేసిన ఖర్చు కూడా అభ్యర్థి ఖర్చుగానే పరిగణిస్తారు. ప్రతీ అభ్యర్థి తప్పనిసరిగా ఎన్నికల ఖర్చుల రిజిస్టర్ నిర్వహించాలి. ఎన్నికల అధికారికి మధ్యలో, ఎన్నికల తర్వాత 30 రోజులలోపు రిజిస్టర్ తప్పక కూపించాలి. ఖర్చుల పరిమితి మించితే ఎన్నిక రద్దయ్యే ప్రమాదం ఉంది. అనర్హత వేసే, భవిష్యత్తు ఎన్నికల్లో పాల్గొనకుండా నిషేధం విధించే అవకాశం ఉంది. ఎన్నికల ఖర్చు విషయంలో పార్టీ అభ్యర్థికి ప్రత్యేక సడలింపు అంటూ ఏమీ ఉండదు. స్వతంత్ర అభ్యర్థికీ అదే





పరిమితి వర్తిస్తుంది. అభ్యర్థుల ఖర్చులపై అధికారులు గట్టి నిఘా వేసి ఉంచుతారు. ప్రతీ రూపాయి లెక్కిస్తారు. అయితే అభ్యర్థి అనుమతితో లేదా ఆదేశంతో జరిగిన ప్రతీ ఖర్చు కచ్చితంగా లెక్కలోకి వస్తుంది.

# ఆదిలాబాద్ జిల్లా రైతులకు వాతావరణ ఆధారిత వ్యవసాయ సలహాలు

**బజార్ హత్నూర్, ఫిబ్రవరి, 03 :-**ఆదిలాబాద్ జిల్లా రైతులకు ప్రొఫెసర్ జయ శంకర్ తెలంగాణ వ్యవసాయ విశ్వ విద్యాలయం ప్రాంతీయ వ్యవసాయ పరిశోధన కేంద్రం జగిత్యాల జిల్లా పొలాస వారు ఒక సలహాల సూచిక పత్రం మంగళవారం రోజు జారీ చేస్తూ వాతావరణ ఆధారిత సలహాలు ఇలా తెలియ జేశారు. గత మూడు రోజులుగా వివిధ ప్రాంతాల్లో వాతావరణం ప్రధానంగా పొడిగా ఉండి పగటి ఊష్ణోగ్రత్తలు 30-31 డిగ్రీల సెల్సియస్ రాత్రి వేళల్లో 17-18సెల్సియస్గా నమోదు అయ్యాయి. రాబోయే ఐదు రోజులు ఫిబ్రవరి 4నుంచి 8వ తేదీ వరకు జిల్లాల్లో ప్రధానంగా వాతావరణం పొడిగా ఉండవచ్చని హైదరాబాద్ వాతావరణం సమాచార కేంద్రం తెలిపింది.పగటి (గరిష్ట )ఊష్ణోగ్రత 32-32డిగ్రీల సెల్సియస్, రాత్రి (కనిష్ఠ )ఊష్ణోగ్రత 14-16డిగ్రీల సెల్సియస్ నమోదు కావచ్చు.గాలిలో తేమ ఉదయం 69-80శాతం, మధ్యాహ్నం 38-43శాతం ఉండవచ్చునని తెల్పింది. ఈషాన్య దిశ నుంచి సరాసారి గాలులు గంటకు 3-7కిలోమీటర్ల వేగంతో వీచే అవకాశం ఉంది.వాతావరణ ఆధారిత వ్యవసాయ సలహాలు:-

సాదారణ సలహా ప్రకారం ప్రస్తుత పొడి వాతావరణ పరిస్థితులలో జొన్న పంటలో పేను బంక ఆశించుటకు అవకాశం కలదు.ఈ పురుగుపంటను ఆశించటం రైతులు గమనించినట్లయితే నివారణకు 1.5 గ్రాముల ఏపీసెట్ ఒక లీటర్ నీటికి కల్పిపిచికారీ చేయాలి.ఎస్ ఎం ఎస్ సలహా ప్రకారం ప్రస్తుత పొడి వాతావరణ పరిస్థితిలో మామిడిలో పలదీకరణం(పిందెలు పట్టడం)పెంపొందించడానికి 3 గ్రాముల బోరాక్స్ లీటర్ నీటికికల్పి పిచికారీ చేయాలని తెలిపారు.ఇక వరి పంట విషయానికి వస్తే ప్రస్తుత వాతావరణ పరిస్థితిలో అగ్ని తెగులు సోకే అవకాశం ఉంది.ఈ లక్షణాలు గమనించినట్ల యితే 0.6 గ్రాములు ట్రై సైక్లో జోల్ (లేదా )2.5 మిల్లిమీటర్ల కాసుగమైసిన్ (లేదా )2.5 గ్రాముల ట్రై సైక్లో జోల్ ఒమాంకో జెట్ లీటర్ నీటికి కల్పి పిచికారీ చేయాలని తెలియ జేశారు.వరిలో కాండం తొలుచు పురుగు ఆశించినట్ల యితే 4 కిలోల క్లోరాంట్రా నిలిపోల్ 0.4 జింక్ గుళికలను ఒక ఎకరానికి సరిపడు ఇసుకలో కలుపుకొని బురద పదునులో /తక్కువ నీరు పెట్టి చల్లుకోవచ్చని వ్యవసాయ శాస్త్ర వేత్తలు (పరిశోదకులు)సెలవిచ్చారు.


ప్రొఫెసర్ జయశంకర్ తెలంగాణ వ్యవసాయ విశ్వవిద్యాలయం
ప్రాంతీయ వ్యవసాయ పరిశోధన స్థానం, పొలాస, జగిత్యాల జిల్లా

ఆదిలాబాద్ జిల్లా యొక్క రైతులకు వాతావరణ ఆధారిత వ్యవసాయ సలహాలు

బులెటిన్ నం. 10/2026 తేది : 03.02.2026

గత మూడురోజుల వాతావరణం:
గత మూడు రోజుల్లో జిల్లాలో వివిధ ప్రాంతాల్లో వాతావరణం ప్రధానంగా పొడిగా ఉందిపగటి . ఉష్ణోగ్రత 30-31 డిగ్రీల సెల్సియస్ మరియు రాత్రి ఉష్ణోగ్రత 17-18 డిగ్రీల సెల్సియస్ గా నమోదయ్యాయి.

రాబోవు ఐదు రోజుల వాతావరణం (ఫిబ్రవరి 4 నుండి ఫిబ్రవరి 8 వరకు) :
హైదరాబాద్ వాతావరణ కేంద్రం నుండి వచ్చిన సమాచారం ప్రకారం, రానున్న 5 రోజులలో జిల్లాలో వాతావరణం ప్రధానంగా పొడిగా ఉండవచ్చును. పగటి (గరిష్ట) ఉష్ణోగ్రత 32-32 డిగ్రీల సెల్సియస్ మరియు రాత్రి (కనిష్ఠ) ఉష్ణోగ్రత 14-16 డిగ్రీల సెల్సియస్ మధ్య నమోదుకావచ్చు. గాలిలోని తేమ ఉదయం 69-80 శాతం మరియు మధ్యాహ్నం 38-43 శాతం మధ్య ఉండవచ్చు. ఈశాన్య దిశ నుండి గాలులు సరాసరి గంటకు 3-7 కిలో మీటర్ల వేగంతో వీచే అవకాశం వున్నది.

వాతావరణాధారిత వ్యవసాయ సలహాలు

సాధారణ సలహా :
- ప్రస్తుతం పొడి వాతావరణ పరిస్థితులలో, జొన్నలో పేనుబంక ఆశించుటకు అవకాశం కలదు. ఈ పురుగు ఆశించడం గమనించినట్లైతే, నివారణకు 1.5 గ్రా ఎసిఫేట్ లీటరు నీటికి కలిపి పిచికారి చేయాలి.

ఎస్.ఎం. ఎస్. సలహా
- ప్రస్తుత పొడి వాతావరణ పరిస్థితుల్లో, మామిడిలో ఫలదీకరణం (పిందె పట్టడం) పెంపొందించడానికి 3గ్రా . బొరాక్స్ లీటర్ నీటికి కలిపి పిచికారీ చేయాలి.

వరి
- ప్రస్తుతం వాతావరణ పరిసితులలో, వరిలో అగ్గి తెగులు సోకే అవకాశం ఉంది. ఈ లక్షణాలు గమనించినటైతే

# హోలీకి ముందు శని, శుక్రుల అరుదైన కలయిక.. ఈ రాశులవారికి లాభాలు



జ్యోతిషశాస్త్రం ప్రకారం గ్రహాల సంచారమే అన్ని రాశుల వారి జీవితాన్ని నిర్ణయిస్తుంది. గ్రహాలు నిర్దిష్ట కాలమానం ప్రకారం చేస్తూ వివిధ రాశుల పైన సానుకూల ప్రతికూల ప్రభావాలను చూపిస్తాయి. అయితే ఈ సంవత్సరం మార్చి నెలలో నాలుగవ తేదీన హోలీ పండుగను జరుపుకుంటాము.హోలీకి ముందు శు క్రుడు మరియు శని సంయోగంహోలీ పండుగకు ముందు శు క్రుడు మరియు శని మార్చి రెండవ తేదీన సంయోగం చెంది ఈ శుక్ర శని సంయోగం కారణంగా కొన్ని రాశుల జాతకులు అదృష్ట జాతకులు అవుతున్నారు. వీరికి ఈ సమయంలో అన్ని విధాలా లబ్ది జరుగుతుంది. మరి ఆ రాశులు ఏమిటో ప్రస్తుతం తెలుసుకుందాం.మిథున రాశిశని మరియు శుక్రుల కలయిక కారణంగా మిథున రాశి జాతకులు అదృష్టాన్ని చూస్తారు. ఈ కలయిక మిథున రాశిలో కర్మ భావంలో ఏర్పడడం వల్ల మిథున రాశి వారికి పనిలోనూ వ్యాపారంలోనూ పురోగతి కనిపిస్తుంది. నిరుద్యోగులకు ఉద్యోగాలు లభిస్తాయి. ఉద్యోగులకు ప్రమోషన్లు వస్తాయి .వ్యాపారవేత్తలు గణనీయమైన ఆర్థిక లాభాలను చూస్తారు. వారి వ్యాపారాలు విస్తరిస్తాయి.వృషభ రాశిశని మరియు శుక్రుల కలయిక వృషభ రాశి జాతకులకు సానుకూల ఫలితాలను ఇస్తుంది. ఈ సంయోగం వృషభ రాశి యొక్క సంచార చార్ట్ లో ఆదాయం మరియు లాభ గృహంలో జరుగుతుంది. దీనివల్ల వృషభ రాశి వారి ఆదాయం బాగా పెరుగుతుంది. నూతన ఆదాయ వనరులు ఈ సమయంలో కనిపిస్తాయి. ఎగుమతి, దిగుమతి వ్యాపారాలు చేసే వారికి లాభాలు వస్తాయి. పాత పెట్టుబడుల నుండి ప్రయోజనాలు పొందుతారు.మీన రాశిశుక్రుడు మరియు శని కలయిక కారణంగా మీనరాశి జాతకులు లబ్ధిని పొందుతారు. ఈ కలయిక మీన రాశిలో లగ్న గృహంలో ఏర్పడుతుంది. ఈ సమయంలో మీన రాశి వారి వ్యక్తిత్వం మెరుగుపడుతుంది. అవివాహితులకు వివాహ ప్రతిపాదనలు వస్తాయి. సమాజంలో గౌరవ, మర్యాదలు లభిస్తాయి. మీనరాశి వారి ఆత్మవిశ్వాసం పెరుగుతుంది. ఇది మీన రాశి వారికి అన్ని విధాలుగా శుభ ఫలితాలను ఇచ్చే కలయిక.ఈ సమాచారం జ్యోతిష్య నిపుణులు మరియు ఇంటర్నెట్ లో లభించిన సమాచారం ఆధారంగా రూపొందించబడింది. దీనిని ధ్రువీకరించలేదు.

# తగ్గినట్టే తగ్గి షాకిచ్చిన ధరలు: మళ్లీ ఆకాశానికి పసిడి, వెండి




గడిచిన కొద్ది రోజులుగా బంగారం, వెండి ధరలు సామాన్యులకు చుక్కలు చూపిస్తున్నాయి. తగ్గినట్టే తగ్గి మళ్లీ రికార్డు స్థాయిలో పెరుగుతూ ఇన్వెస్టర్లను సైతం ఆశ్చర్యానికి గురిచేస్తున్నాయి. గడిచిన నాలుగు రోజులుగా భారీగా తగ్గుతూ వచ్చిన బంగారం, వెండి ధరలు మళ్లీ ఒక్కసారిగా పైకి ఎగబాకాయి. ముఖ్యంగా వెండి ధరలు ఆకాశన్నంటగా.. బంగారం కూడా అదే బాటలో పయనిస్తోంది. గత వారం రోజులుగా బులియన్ మార్కెట్ అస్థిరంగా మారుతుండటంతో అసలు ధరలు ఎప్పుడు పెరుగుతాయో.. ఎప్పుడు తగ్గుతాయో అర్థం కాని పరిస్థితి నెలకొంది.నేటి మార్కెట్ ధరల విశ్లేషణమల్టీ కమోడిటీ ఎక్స్ఛేంజ్(ఎంసీఎక్స్)లో మంగళవారం(ఫిబ్రవరి 3) మధ్యాహ్నం 3 గంటల సమయానికి ధరల ట్రెండ్ చాలా ఉద్ధృతంగా ఉంది. వెండి కేవలం ఒకే రోజులో రూ.30,000 పెరిగి , కిలో వెండి ధర రూ.2.66 లక్షల పైన ట్రేడ్ అవుతోంది. మరోవైపు 10 గ్రాముల బంగారం ధర సుమారు రూ.8000 పెరిగి రూ.1.52 లక్షల మార్కును చేరింది. ఇలా అకస్మాత్తుగా ధరలు పెరగడంతో కొనుగోలుదారులు బెంబేలెత్తిపోతున్నారు.'రోలర్ కోస్టర్' రైడ్ను తలపిస్తున్న పసిడిగత కొద్ది రోజులుగా బంగారం, వెండి ధరలు ఒక 'రోలర్ కోస్టర్' రైడ్ను తలపిస్తున్నాయి. జనవరి 29న వెండి కిలో రూ.4.20 లక్షలు, బంగారం 10 గ్రాములు రూ.1.93 లక్షల వద్ద ఆల్-టైమ్ రికార్డును తాకాయి. అయితే ఆ తర్వాత కేవలం 4 రోజుల్లోనే వెండి రూ.1.95 లక్షలు తగ్గి రూ.2.25 లక్షలకు, బంగారం రూ.56,000 తగ్గి రూ.1.37 లక్షలకు పడిపోయాయి. ఇప్పుడు మళ్లీ రికవరీ మొదలై రెండు రోజుల్లోనే వెండి రూ.41,000, బంగారం రూ.15,000 వరకు పుంజుకున్నాయి.పెరుగుదల వెనుక అసలు కారణాలుఈ ధరల పెరుగుదలకు ప్రధానంగా అంతర్జాతీయ పరిణామాలు కారణమవుతున్నాయి. అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ భారత్తో ట్రేడ్ డీల్ ప్రకటించడం, టారిఫ్ రేట్లను తగ్గించడం వంటి పరిణామాలతో మార్కెట్లో సానుకూల వాతావరణం ఏర్పడింది. దీనికి తోడు రికార్డు స్థాయిల నుంచి ధరలు భారీగా పడిపోవడంతో, ఇదే మంచి సమయమని ఇన్వెస్టర్లు "డిప్ కొనుగోళ్లు" చేస్తున్నారు. అంటే తక్కువ ధరకు దొరికినప్పుడు భారీగా స్టాక్ కొనుగోలు చేయడం వల్ల మళ్లీ డిమాండ్ పెరిగి ధరలు అమాంతం పైకి చేరుతున్నాయి.

అంతర్జాతీయ మార్కెట్ ప్రభావంఅంతర్జాతీయ మార్కెట్లో కూడా పసిడి సెగలు పుట్టిస్తోంది. గోల్డ్ స్పాట్ ప్రైస్ ఔన్స్కు సుమారు 4,700 డాలర్ల నుంచి 4,950 డాలర్ల మధ్య కొనసాగుతుండగా.. వెండి ధర ఔన్స్కు 79 - 87 డాలర్ల మధ్య ట్రేడ్ అవుతోంది. డాలర్ విలువలో మార్పులు, ప్రపంచ రాజకీయాల్లో నెలకొన్న అనిశ్చితి వల్ల ఇన్వెస్టర్లు సురక్షితమైన పెట్టుబడిగా భావించే బంగారం వైపు మొగ్గు చూపుతున్నారు. దీంతో భారత్ వంటి దేశాల్లో కూడా దిగుమతి వ్యయం పెరిగి ధరలు నియంత్రణ లేకుండా పెరుగుతున్నాయి.

ప్రస్తుతం మార్కెట్ ఉన్న స్థితిలో ధరలు మరింత పెరిగే అవకాశం ఉందని కొందరు నిపుణులు హెచ్చరిస్తున్నారు.

# బుల్ పరుగులు, రూ.12 లక్షల కోట్లు వచ్చేశాయ్



ఎన్నాళ్లుగా నిరీక్షణలో ఉన్న దేశీయ స్టాక్ మార్కెట్కు ఒక్కసారిగా కొత్త ఊపిరి వచ్చింది. అమెరికాతో వాణిజ్య ఒప్పందంపై స్పష్టత రావడంతో ఇన్వెస్టర్లలో ఉత్సాహం ఉప్పొంగింది. ఉదయం మార్కెట్ తెరచిన క్షణం నుంచి ముగింపు వరకు బుల్ రన్ ఆగకుండా సాగింది. ఫలితంగా సెన్సెక్స్ రెండు వేల పాయింట్లకు పైగా దూస ుకెళ్లగా, నిఫ్టీ కీలకమైన 25,700 స్థాయిని దాటి నిలిచింది. మార్కెట్ మొత్తం పచ్చని వెలుగులతో మెరిసింది.ఈ భారీ ర్యాలీతో బీఎస్ఈలో నమోదైన కంపెనీల మార్కెట్ విలువ ఒక్కరోజులోనే సుమారు రూ.12 లక్షల కోట్లు పెరిగింది. మొత్తం మార్కెట్ క్యాపిటలైజేషన్ రూ.467.35 లక్షల కోట్లకు చేరి మదుపర్ల సంపదను కొత్త రికార్డుకు తీసుకెళ్లింది.

భారత్తో వాణిజ్య ఒప్పందానికి అంగీకరిస్తున్నట్లు అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ చేసిన ప్రకటన మార్కెట్కు అసలైన టానిక్గా మారింది. భారత్పై విధించిన ప్రతీకార సుంకాలను 50 శాతం నుంచి 18 శాతానికి తగ్గిస్తున్నామని ఆయన వెల్లడించారు. అంతేకాదు, అమెరికా దిగుమతులపై సుంకాలను సున్నా స్థాయికి తీసుకెళ్లడం, రష్యా నుంచి చమురు దిగుమతులపై పరిమితులు విధించేందుకు భారత్ అంగీకరించిందని ట్రంప్ తెలిపారు. ఈ ప్రకటనతో భారత ఉత్పత్తులపై ఒత్తిడి తగ్గనుందని మార్కెట్ అంచనా వేసింది. ఫలితంగా సూచీలు ఒక్కసారిగా దూసుకెళ్లా యి.బుల్ రన్ వివరాలుసెన్సెక్స్ ప్రారంభంలోనే సుమా రు 3,600 పాయింట్ల లాభంతో 85,323 స్థాయిలో తెరచుకుంది. ఇంట్రాడేలో 85,871 వద్ద గరిష్ఠాన్ని తాకింది. చివరకు 2,072 పాయింట్ల లాభంతో 83,739 వద్ద ముగిసింది .నిఫ్టీ కూడా జోరు చూపిస్తూ 26,341 స్థాయిని తాకి, చివరకు 639 పాయింట్ల లాభంతో 25,727 వద్ద స్థిరపడింది.స్టాక్ మార్కెట్తో పాటు రూపాయి కూడా బలపడింది. డాలర్తో పోలిస్తే ఒక్కరోజులోనే రూపాయి 1.36 శాతం లాభపడి 90.26 స్థాయికి చేరింది. ఇంత బలమైన రికవరీ ఇటీవలి కాలంలో ఇదే తొలిసారి.

లాభాల్లో మెరిసిన స్టాక్స్సెన్సెక్స్ 30 స్టాక్స్లో టెక్ మహీంద్రా, బీఈఎల్ మినహా మిగిలిన అన్ని షేర్లు లాభాల్లో ముగిశాయి.అదానీ పోర్ట్స్, బజాజ్ ఫైనాన్స్, ఇండిగో, పవర్గ్రిడ్, సన్ ఫార్మా వంటి స్టాక్స్ భారీ లాభాలు నమోదు చేశాయి.

## సాలూర లో ముమ్మరంగా కాలువల పూడికతీత పనులు



**బోధన్, నిజామాబాద్ జిల్లా, 03ఫిబ్రవరి :**సాలూర మండల కేంద్రంలోని 10వ వార్డులో గల టీటీడీ కల్యాణ మండపం సమీపంలో పారిశుధ్య పనులు వేగవంతంగా సాగుతు న్నాయి. వార్డులోని ప్రధాన మురుగు కాలువల్లో పేరుకుపోయిన పూడికను మంగళవారం జేసీబీ సహాయంతో తొలగించారు. కాలువల్లో మట్టి, వ్యర్థాలు భారీగా పేరుకుపోవడంతో మురుగునీరు సాఫీగా ప్రవహించక పరిసర ప్రాంతాల్లో దుర్వాసన వస్తోందని స్థానికులు ఫిర్యాదు చేశారు. దీనిపై స్పందించిన వార్డు సభ్యుడు సోక్కం ప్రశాంత్, ఉప సర్పంచ్ సురేష్ పటేల్ కాలువలను శుభ్రం చేయించారు. కాలువలు వెడల్పుగా మారి, నీటి ప్రవాహానికి అడ్డంకులు తొలగడంతో స్థానికులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. భవిష్యత్తులో కాలువల్లో చెత్త వేయకుండా ప్రతి ఒక్కరూ సహకరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో స్థానిక నాయకులు సోక్కం రవి, డిస్కో సాయిలు, కుంట్ల భీమయ్య, భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

## బోధన్లో గంజాయి కలకలం.. ఒకరి అరెస్టు

**- నాందేడ్ నుంచి రవాణా.. 1.26 కిలోల మత్తు పదార్థం స్వాధీనం**




**బోధన్, నిజామాబాద్ జిల్లా, 03ఫిబ్రవరి :**యువత భవిష్యత్తును చిన్నాభిన్నం చేస్తున్న గంజాయి విక్రయాలపై పోలీసులు ఉక్కుపాదం మోపుతున్నారు. బోధన్ పట్టణంలో గంజాయి విక్రయిస్తున్న మహ్మద్ అఫ్రోస్ అలీ అనే వ్యక్తిని పోలీసులు అరెస్టు చేశారు. మంగళవారం ఏసీపీ శ్రీనివాస్ తన కార్యాలయంలో వివరాలను వెల్లడించారు. పట్టణ శివారులోని రవి గార్డెన్ వద్ద సోమవారం పోలీసులు ముమ్మరంగా వాహన తనిఖీలు చేపట్టారు. ఈ క్రమంలో స్కూటీపై వస్తున్న అఫ్రోస్ అలీని అనుమానంతో తనిఖీ చేయగా, అతని వద్ద 1,265 గ్రాముల గంజాయి దొరికింది. నిందితుడు మహారాష్ట్రలోని నాందేడ్ నుంచి గంజాయిని తక్కువ ధరకు కొనుగోలు చేసి, బోధన్ పట్టణంలో గుట్టుచప్పుడు కాకుండా విక్రయిస్తున్నట్లు ఏసీపీ తెలిపారు. నిందితుడి నుంచి గంజాయితో పాటు మూడు సెల్ఫోన్లు, ఒక స్కూటీని స్వాధీనం చేసుకున్నారు. ఈ సందర్భంగా ఏసీపీ మాట్లాడుతూ.. గంజాయి విక్రయించినా, వినియోగించినా చట్టపరంగా కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. అఫ్రోస్కు గంజాయి సరఫరా చేస్తున్న ప్రధాన ముఠా కోసం గాలిస్తున్నామని తెలిపారు. ఈ సమావేశంలో టౌన్ సీఐ వెంకటనారాయణ, ఎస్సై భాస్కరాచారి మరియు ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

## నిజామాబాద్లో సీఎం బహిరంగ సభ ఏర్పాట్లను పరిశీలించిన కలెక్టర్, సీపీ



**నిజామాబాద్ జిల్లా, 03ఫిబ్రవరి :**ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఈ నెల 6న నిజామాబాద్ జిల్లాకు రానున్న నేపథ్యంలో అధికార యంత్రాంగం అప్రమత్తమైంది. నగర శివారులోని బైపాస్ రోడ్డులో నిర్వహించనున్న భారీ బహిరంగ సభ కోసం ఏర్పాట్లు యుద్ధప్రతిపదికన సాగుతున్నాయి. మంగళవారం కలెక్టర్ ఇలా త్రిపాఠి, పోలీస్ కమిషనర్ సాయిచైతన్య కలిసి సభా ప్రాంగణాన్ని, హెలీప్యాడ్ నిర్మాణ పనులను క్షేత్రస్థాయిలో పరిశీ లించారు. సభకు భారీగా జనం వచ్చే అవకాశం ఉన్నందున ఎక్కడా చిన్నపాటి లోటుపాట్లు కూ డా తలెత్తకుండా చూడాలని కలెక్టర్ అధికారులను ఆదేశించారు. పటిష్టమైన పోలీసు బందో బస్తు నిర్వహించాలని, ఎక్కడా అవాంఛనీయ సంఘటనలు జరగకుండా చూడాలని సీపీ అధి కారులకు సూచించారు. సభకు వచ్చే వాహనాల కోసం అనువైన స్థలాలను కేటాయించి, ట్రా ఫిక్ ఇబ్బందులు లేకుండా చూడాలని పేర్కొన్నారు. వేదిక, హెలీప్యాడ్ పనులను గడువులోపు పూర్తి చేయాలని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ కిరణ్ కుమార్, ట్రెయినీ కలెక్టర్ కరోలిన్ చింగ్తియాన్మావి, మున్సిపల్ కమిషనర్ దిలీప్ కుమార్ తదితర అధికారులు పాల్గొన్నారు.

## 4 గ్రహాల కలయికతో ఈ రాశులకు అద్భుతమైన ధనయోగం



ఫిబ్రవరి నెలలో కీలకమైన నాలుగు గ్రహాలు ఒకే రాశిలో కలుసుకుంటున్నాయి. దీనివల్ల కొన్ని రాశులవారికి అద్భుతంగా కలిసి రానుంది. వారికి అసాధారణమైన యోగం పట్టుకుంటోంది. ఒకరకంగా ఆయా రాశు లవారు జాక్ పాట్ కొట్టినట్లేనని జ్యోతిష్య పండితులు తెలియజేస్తున్నారు. 3వ తేదీన బుధుడు కుంభరాశిలోకి, 6వ తేదీన శు క్రుడు, 13వ తేదీన సూర్యుడు, 23వ తేదీన కుజుడు కుంభరాశిలోకి ప్రవేశిస్తారు. దీనికి అధిపతి శనిదేవుడు. ఇలా ఈ నాలుగు గ్రహాలు కుంభరాశిలో కలుసుకోవడంతో చతుర్గ్రాహి యోగం ఏర్పడుతోంది. ఆర్థికంగా మంచి ప్రయోజనాలు దక్కించుకుంటారు.మేష రాశిఉద్యోగులకు పదోన్నతి ఉంది. వారికి మంచి ఆర్థిక లాభాలు కూడా ఉన్నాయి. ఆధ్యాత్మిక పరమైన కార్యకలాపాలపై ఆసక్తి పెరుగుతుంది. కొత్తగా ఆదాయ వనరులు దొరుకుతాయి. వ్యాపారాన్ని ప్రారంభించాలని ఎదురుచూసేవారికి ఇది మంచి సమయం.కన్యా రాశిఉద్యోగులకు వారి కార్యాలయాల్లో మంచి ప్రయోజనాలు దక్కుతాయి. అంతేకాకుండా ఆకస్మికంగా ఆర్థిక లాభాలుంటాయి. ఆర్థిక పరిస్థితిని బలోపేతం చేయడంవల్ల సమాజంలో మంచిపేరు దక్కించుకుంటారు. దాంపత్య జీవితంలో ఆనందం వెల్లివిరుస్తుంది.మిథున రాశిశుభవార్తలు చెవిన పడతాయి. విద్యారంగంలో సానుకూల ఫలితాలుంటాయి. స్టాక్ మార్కెట్ లో పెట్టుబడి పెట్టడానికి ఎదురుచూసేవారికి ఇది చాలా అనువైన సమయం. వ్యాపారస్తులకు మంచి లాభాలున్నాయి. నిరుద్యోగులకు ఉద్యోగ అవకాశాలు తలుపు తడతాయి.

# ఎన్నికల నియమాలను అతిక్రమిస్తే కఠిన చర్యలు

**– వికారాబాద్ జిల్లా ఎస్పీ స్నేహ మెహ్రా**



**వికారాబాద్ ఫిబ్రవరి 4 :** మున్సిపల్ ఎన్నికల సందర్భంగా మంగళవారం తెలంగాణ రాష్ట్ర డీజీపీ, ఆధ్వర్యంలో నిర్వహించిన ఆన్లైన్ ఒరియెంటేషన్, ట్రైనింగ్ కార్యక్రమంలో జిల్లా ఎస్పీ స్నేహ మెహ్రా, పాల్గొన్నారు. ఈ కార్య్ర కమం ముఖ్య ఉద్దేశం మున్సిపల్ ఎన్నికల సమయంలో తీసుకోవాల్సిన భద్రతా చర్యలు, శాంతిభద్రతల పరిరక్షణ, చట్ట అమలు అంశాలపై చర్చించారు. ఈ కార్యక్రమం అనంతరం జిల్లా ఎస్పీ స్నేహ మెహ్రా, మాట్లాడుతూ, జిల్లాలో మున్సిపల్ ఎన్నికలు ప్రశాంతంగా, పారదర్శకంగా నిర్వహించేందుకు పోలీస్ శాఖ పూర్తిస్థాయిలో సిద్ధంగా ఉందని తెలిపారు. ఎన్నికల నియమావళిని కఠినంగా అమలు చేస్తూ, ఎలాంటి అవాంఛనీయ సంఘటనలకు అవకాశం లేకుండా అన్ని ముందస్తు చర్యలు చేపడుతున్నట్లు పేర్కొన్నారు. ఎన్నికల సమయంలో సమస్యాత్మక ప్రాంతాల్లో అదనపు పోలీస్ బందోబస్తు ఏర్పాటు చేయడం, ఫ్లాగ్ మార్చ్‌లు నిర్వహించడం, గస్తీ చర్యలను మరింత బలోపేతం చేయడం జరుగుతుందని తెలిపారు. అసాంఘిక శక్తులు, చట్టవ్యతిరేక కార్యకలాపాలపై కఠిన నిఘా ఉంచి, ఓటర్లను భయభ్రా ంతులకు గురిచేసే ప్రయత్నాలను సహించబోమని హెచ్చరించారు. అదేవిధంగా, ఎన్నికల ప్రవర్తనా నియమాలను అతిక్రమించే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని, మద్యం, నగదు, బహుమతుల పంపిణీపై ప్రత్యేక దృష్టి సారించి తనిఖీలు నిర్వహిస్తామని తెలిపారు. ప్రజలు కూడా పోలీస్ శాఖకు సహకరించి, ఎలాంటి అనుమానాస్పద విషయాలు కనిపించినా వెంటనే సమాచారం అందించాలని జిల్లా ఎస్పీ కోరారు. ఈ కార్యక్రమం లో జిల్లా లోని పోలీస్ అధికారులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# మున్సిపల్ ఎన్నికల్లో బాగంగా పరిగి లో ఫ్లాగ్ మార్చ్

**– పాల్గొన్న పరిగి డీఎస్పీ శ్రీనివాస్, సిఐ. శ్రీనివాస్ రెడ్డి**



**పరిగి ఫిబ్రవరి 4 :** మున్సిపల్ ఎన్నికల్లో భాగంగా పరిగి మున్సిపల్ పరిధిలోని అన్ని వార్డులలో ఫ్లాగ్ మార్చ్ నిర్వహించిన పరిగి పోలీసులు, వికారాబాద్ జిల్లా ఎస్పీ స్నేహ మెహ్రా, ఆదేశాల మేరకు మంగళవారం మున్సిపల్ ఎన్నికల నిర్వహణలో భాగంగా పరిగి పోలీస్ స్టేషన్ పరిధిలో ఫ్లాగ్ మార్చ్ కార్యక్రమం నిర్వహించడం జరిగింది. ఈ కార్య్ర కమంలో పరిగి డిఎస్పి ఎన్ శ్రీనివాస్, సర్కిల్ ఇన్స్పెక్టర్ శ్రీనివాస్ రెడ్డి,లు పాల్గొన్నారు. ఈ కార్యక్రమన్ని ఉద్దేశించి వారు మాటా ్లడుతూ.... ఎన్నికల సమయంలో శాంతిభద్రతలు కట్టుదిట్టంగా నిర్వహించేందుకు పోలీస్ శాఖ పూర్తిగా సిద్ధంగా ఉందని ప్రజలకు భరోసా కల్పించడమే ఫ్లాగ్ మార్చ్ యొక్క ముఖ్య ఉద్దేశం అన్నారు. పరిగి పట్టణంతో పాటు మున్సిపల్ కు సంబంధించిన అన్ని వార్డులలో ఫ్లాగ్ మార్చ్ నిర్వహినుంచ్చినట్టు తెలిపారు. ప్రతి ఒక్కరూ ఎన్నికల కోడ్, ను కచ్చితంగా పాటించాలని, చట్టవ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. అదేవిధంగా ప్రజలు ఎవ్వరూ భయాందోళనలకు లోనుకాకుండా స్వేచ్ఛాయుత వాతావరణంలో తమ ఓటు హక్కును వినియోగించుకోవాలని సూచించారు. ఎన్నికల సమయంలో అసాంఘిక చర్యలు, మద్యం అక్రమ రవాణా, నగదు పంపిణీ వంటి వాటిపై ప్రత్యేక నిఘా ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో పరిగి, కుల్క చర్ల, దోమ, పోలీస్ స్టేషన్‌లకు చెందిన ఎస్.ఐ, లు, మోహన్ కృష్ణ, రమేష్ కుమార్, వసంత్ జాదవ్, పరిగి సబ్ డివిజన్ పోలీస్ సిబ్బంది, ఏఆర్ పోలీస్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# ప్రచారంలో దూసుకుపోతున్న బిఆర్ఎస్ అభ్యర్థి ఆకారపు గౌతమి రాజు

**– ప్రచారంలో భాగంగా కొబ్బరి బోండాలు కొట్టిన**
**– ఆకారపు గౌతమి రాజు**



**పరిగి ఫిబ్రవరి 4 :** ప్రచారంలో దూసుకుపోతున్న 5వ వార్డు బిఆర్ఎస్ పార్టీ కౌన్సిలర్ అభ్యర్థి ఆకారపు గౌతమి రాజు, పరిగి మున్సిపల్ పరిధిలోని 5 వ వార్డు బిఆర్ఎస్ పార్టీ బలపరిచిన కౌన్సిలర్ అభ్యర్థి ఆకారపు గౌతమి రాజు, మంగళవారం నాడు పార్టీ నాయకులతో, కలిసి వార్డులో గడపగడపకు తిరుగుతూ.. బిఆర్ఎస్ పార్టీ కారు గుర్తుకు ఓటు వేసి నన్ను గెలిపించాలని వార్డు ప్రజలను కోరుతూ.. ఎన్నికల ప్రచారం నిర్వహించడం జరిగింది. వార్డు ప్రజలు సైతం మా ఓటు కారు గుర్తుకే అంటూ అభ్యర్థి ఆకారపు గౌతమి రాజు, కు వారి మద్దతు తెలిపారు. అనంతరం గౌతమి రాజు, మీడియా తో మాట్లాడుతూ.... 5వ వార్డు ప్రజలు నాకు ఓటు వేసి నన్ను ఆశీ ర్వ దిస్తే వార్డు అభివృద్ధే ధ్యేయంగా పనిచేస్తానని ఆయన అన్నారు. పరిగి పట్టణ మున్సిపల్ లోనే సమస్యల రహితంగా 5 వ వార్డును అన్ని విధాల అభివృద్ధి చేస్తానని వార్డు ప్రజలకు ఆయన హామీ ఇచ్చారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలు అర్హులైన ప్రతి కుటుంబానికి చేరేలా ప్రత్యేక కృషి చేస్తానన్నారు. వార్డు పరిధిలోని ఏ కాలనీలో ఎలాంటి సమస్య ఉన్న వెంటనే సంబంధిత అధికారులతో కలిసి సమస్య పరిష్కరించేందుకు కృషి చేస్తానని వారు తెలిపారు. 5 వ వార్డులో మౌలిక వసతులు కల్పించడమే తన ప్రధాన లక్ష్యమని, ముఖ్యంగా తాగునీటి సరఫరా, సీసీ రోడ్ల నిర్మాణం, అండర్ డ్రైనేజీ వ్యవస్థ, పారిశు ధ్యంపై ప్రత్యేక దృష్టి సారిస్తానన్నారు. ప్రజా సమస్యల పరిష్కారంలో రాజీ పడకుండా, ప్రజల గొంతుకగా పని చేస్తానని స్పష్టం చేశారు. నిరంతరం వార్డు అభివృద్ధి కొరకు పనిచేసే నాకు ఒక్క అవకాశం ఇవ్వాలని, ప్రజలను కోరారు. ఈ కార్యక్రమంలో పార్టీ సీనియర్ నాయకులు, యువ నాయకులు, కార్యకర్తలు, వార్డు ప్రజలు, మహిళలు, తదితరులు పాల్గొన్నారు.



# బిఆర్ఎస్ అభ్యర్థులకు బి -ఫారమ్, లు అందజేసిన మాజీ ఎమ్మెల్యే

**– పరిగి మున్సిపల్ పీఠం మళ్లీ బిఆర్ఎస్ దే**
**మాజీ ఎమ్మెల్యే మహేష్ రెడ్డి**





**పరిగి ఫిబ్రవరి 4 :** మున్సిపల్ ఎన్నికల్లో భాగంగా బిఆర్ఎస్ పార్టీ బలపరిచిన అభ్యర్థులకు పరిగి పట్టణంలోని తన నివాసంలో బీఫారమ్, లు అందజేసిన పరిగి నియోజకవర్గ మాజీ శాసనసభ్యులు కొప్పుల మహేష్ రెడ్డి, ఈ సందర్భంగా మాజీ ఎమ్మెల్యే మాట్లాడుతూ..బిఆర్ఎస్ పార్టీ బలపరిచిన అభ్యర్థులు, అందరూ మున్సిపల్ ఎన్నికలను సవాలుగా తీసుకొని పార్టీ నాయకులతో కలిసి ప్రచారం నిర్వహించి పరిగి మున్సిపల్ పై గులాబీ జెండా ఎగరవేయాలని పార్టీ నాయకులకు అభ్యర్థులకు పిలుపునిచ్చారు. కాంగ్రెస్ పార్టీ ప్రజలకు ఇచ్చిన ఆరు గ్యారంటీల హామీలు అమలు చేయకుండా ప్రజలకు చేస్తున్న మోసాన్ని వివరించాలని మాజీ ఎమ్మెల్యే తెలిపారు. అధికారంలోకి వచ్చి రెండు సంవత్సరాలు గడుస్తున్న అవినీతి అక్రమాలకు పాల్పడుతూ ప్రతిపక్ష నాయకుల పై అక్రమ కేసులు పెడుతూ కాలం వెళ్లబోస్తుంది తప్ప రాష్ట్రానికి గాని రాష్ట్ర ప్రజలకు గాని కాంగ్రెస్ పార్టీ వరగబెట్టింది ఏమీ లేదని ఆయన తెలిపారు. అందుకే పార్టీ నాయకులు కార్యకర్తలు అందరూ కలిసికట్టుగా బిఆర్ఎస్ అభ్యర్థుల గెలుపుకు కృషి చేసి మరో సారి పరిగి మున్సిపల్ పీఠాన్ని కైవసం చేసుకోవాలని మాజీ ఎమ్మె ల్యే అన్నారు. పరిగి మున్సిపల్ లో బిఆర్ఎస్ హాయంలో జరిగిన అభివృద్ధి పనులే ఉన్నాయి తప్ప కాంగ్రెస్ చేసింది ఏమీ లేదన్నారు పరిగి మున్సిపల్ పరిధిలోని ప్రజలు సైతం ఏ పార్టీ అధికారంలో ఉంటే ప్రజలకు మేలు జరుగుతుందో వార్డులు అభివృద్ధి చెందుతాయో ఆలోచించి ఓటు వేయాలన్నారు. ఈ కార్యక్రమంలో పరిగి మండల పట్టణ బిఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# ఇకపై కొత్తగా రీఛార్జ్ చేసే వారికి మాత్రమే




ప్రీపెయిడ్ రీఛార్జ్ చేస్తే వేల రూపాయల విలువైన సబ్‌స్క్రిప్షన్ ఉచితం అన్న ఆశతో ఉన్న ఎయిర్‌టెల్ వినియోగదారులకు ఊహించని షాక్ తగిలింది. దేశంలో ప్రముఖ టెలికం సంస్థ అయిన భారతి ఎయిర్‌టెల్ తన ప్రీపెయిడ్ ప్లాన్‌లతో ఇస్తున్న ఉచిత సబ్‌స్క్రిప్షన్‌ను పూర్తిగా నిలిపివేసింది. ఇకపై రీఛార్జ్ చేసినా ఆ ఆఫర్ అందుబాటులో ఉండదని కంపెనీ స్పష్టంచేసింది. గతంలో వినియోగదారులను ఆకర్షించేందుకు ఆఫర్‌ను భారీ హైలైట్‌గా ప్రచారం చేసింది. సాధారణంగా వేల రూపాయలు ఖర్చయ్యే సేవలను పూర్తిగా ఉచితంగా అందిస్తూ టెక్ ప్రపంచంలో సంచలనం సృష్టించింది. అయితే ఇది పరిమిత కాల ఆఫర్ మాత్రమే అని అప్పుడే చెప్పిన ఎయిర్‌టెల్, 2026 జనవరి 16తో ఈ సదుపాయానికి ఫుల్ స్టాప్ పెట్టింది. అయితే, ఇప్పటికే ఈ ఆఫర్‌ను క్లెయిమ్ చేసుకున్న వినియోగదారులకు మాత్రం ఊరట లభించింది. వారు యాక్టివేషన్ తేదీ నుంచి పూర్తి ఒక సంవత్సరం పాటు సేవలను ఎలాంటి అంతరాయం లేకుండా వినియోగించుకోవచ్చని కంపెనీ తెలిపింది. కానీ ఇకపై కొత్తగా రీఛార్జ్ చేసే వారికి మాత్రం ఈ లాభం పూర్తిగా దూరమైంది. ఇదిలా ఉండగా, యూజర్ల అసంతృప్తిని తగ్గించేందుకు మరో ప్రత్యామ్నాయాన్ని తెరపైకి తీసుకొచ్చింది. ప్రముఖ సాఫ్ట్‌వేర్ సంస్థ భాగస్వామ్యం కుదుర్చుకుని, సబ్‌స్క్రిప్షన్‌ను ఉచితంగా అందించనున్నట్లు ప్రకటించింది. ఇందులో జనరేటివ్ ఫీచర్లు, ప్రొఫెషనల్ డిజైన్ టూల్స్ వంటి అనేక ప్రీమియం సదుపాయాలు లభించనున్నాయి. అయినా, కోసం ప్రత్యేకంగా రీఛార్జ్ చేసిన యూజర్లకు మాత్రం నిర్ణయం నిరాశ కలిగించే మార్పుగా మారిందనే చెప్పాలి.

# పెట్రోల్ స్కూటర్లకు ఇక గుడ్ బై: ఒక్క ఛార్జ్‌తో ఊరికి పోయి రావచ్చు



ప్రముఖ ఆటోమొబైల్ దిగ్గజం యమహా కంపెనీ నుంచి ఎప్పుడెప్పుడా అని ఎదురుచూస్తున్న మొదటి ఎలక్ట్రిక్ స్కూటర్ భారత మార్కెట్లోకి వచ్చేసింది. ఫిబ్రవరి 3న(మంగళవారం) ఈ ఎలక్ట్రిక్ స్కూటర్‌ను అధికారికంగా లాంచ్ చేశారు. యమహా కంపెనీ తన ఐకానిక్ డిజైన్ ను ఎలక్ట్రిక్ సెగ్మెంట్లో కూడా కంటిన్యూ చేసింది. ఈ స్కూటర్ చూడటానికి చాలా ప్రీమియం లుక్‌లో ఉంటుంది. ఈ స్కూటర్ ఎక్స్-షోరూమ్ ధరను రూ. 1,67,600 గా నిర్ణయించారు. ప్రస్తుతం ఇది 'బ్లూయిష్ వైట్' కలర్ ఆప్షన్‌లో అందుబాటులో ఉంది. ఎంపిక చేసిన నగరాల్లోని యమహా 'బ్లూ స్క్వేర్' షోరూమ్‌ల ద్వారా దీనిని మీరు సొంతం చేసుకోవచ్చు. ఈ ఎలక్ట్రిక్ స్కూటర్ బ్యాటరీ, రేంజ్ వివరాలిలా.. ఈ ఎలక్ట్రిక్ స్కూటర్ ఒక్కసారి ఫుల్ ఛార్జ్ చేస్తే 169 కిలోమీటర్ల రేంజ్ ఇస్తుంది. ఇందులో ఫిక్స్‌డ్ బ్యాటరీని వాడారు. దీని మోటార్ 9్రూ పవర్, 26 చీఎ టార్క్‌ను ఉత్పత్తి చేస్తుంది. ఇది గంటకు 79 కిమీ టాప్ స్పీడ్‌తో వెళ్తుంది. ఇంట్లో ఉండే ఛార్జర్‌తో దీనిని సుమారు 8 గంటల్లో ఫుల్ ఛార్జ్ చేసుకోవచ్చు. బ్యాటరీపై కంపెనీ 3 ఏళ్లు లేదా 30,000 కిలోమీటర్ల వరకు వారంటీ ఇస్తోంది. అదిరిపోయే ఫీచర్లుయమహా 06లో రైడర్ల సౌకర్యం కోసం అద్భుతమైన ఫీచర్లు అమర్చారు. ఈ ఎలక్ట్రిక్ స్కూటర్లో ఎక్, స్టాండర్డ్, పవర్ అనే మూడు మోడ్స్ ఉన్నాయి. ఈ స్కూటర్ ఇరుకైన సందుల్లో లేదా పార్కింగ్ చేసేటప్పుడు.. స్కూటర్ ను వెనక్కి తీయడానికి రివర్స్ మోడ్ ఫీచర్ ఎంతగానో పని చేస్తుంది. స్పీడ్, బ్యాటరీ ఛార్జింగ్ లెవెల్ చూసుకోవడానికి కలర్ ఎల్సీడీ డిస్ ప్లే ఉంది.'యామహా మోటార్ కనెక్ట్ ఆర్' యాప్ ద్వారా ఫోన్‌ను కనెక్ట్ చేసుకుని రియల్ టైమ్ డేటాను చూడవచ్చు. సీటు కింద 24.5 లీటర్ల ఖాళీ ఉంటుంది, ఇందులో హెల్మెట్ లేదా ఇతర వస్తువులను సులభంగా పెట్టుకోవచ్చు.

భద్రత, డిజైన్ఈ స్కూటర్‌లో రెండు వైపులా డిస్క్ బ్రేక్‌లు ఇచ్చారు. మోటార్, బ్యాటరీకి రేటింగ్ ఉంది, అంటే వర్షంలో తడిసినా లేదా నీటి గుంటల్లో వెళ్లినా ఎలాంటి ఇబ్బంది ఉండదు. ముందు వైపు టెలిస్కోపిక్ సస్పెన్షన్ ఉండటం వల్ల గుంతల రోడ్లపై కూడా రైడింగ్ సాఫీగా సాగుతుంది. యమహా మార్కెట్లో ఉన్న టీవీఎస్ ఐక్యూబ్, బజాజ్ చేతక్, ఏథర్ వంటి స్కూటర్లకు గట్టి పోటీ ఇచ్చేలా కనిపిస్తోంది. టెక్నాలజీతో పాటు నచ్చుతుంది.

# రోజూ వర్కౌట్ చేస్తున్నారా ఈ ముఖ్య విషయాలు తెలుసుకోండి



ఫిట్‌గా ఉండాలని, బరువు తగ్గాలని రోజూ వ్యాయామం చేసే వారు చాలామందే ఉన్నారు. అయితే, వ్యాయామానికి ముందు తీసుకునే ఆహారం, తర్వాత తీసుకునే ఆహారంపై కొంత మంది శ్రద్ధ చూపరు. దీని వల్ల ఆశించిన ఫలితాలు ఆలస్యం అవుతాయని ఫిట్‌నెస్ నిపుణులు చెబుతున్నారు. తినకుండా వ్యాయా మం చేస్తున్నారాత్వరగా బరువు తగ్గాలనే ఆతృతలో కొంతమంది పూర్తిగా ఖాళీ కడుపుతో కసరత్తులు చేస్తుంటారు. ఇంకొందరు అవసరానికి మించి తినేస్తారు. ఈ రెండు అలవాట్లు శరీరానికి హానికరమని నిపుణులు హెచ్చరిస్తున్నారు. వ్యాయామానికి ముందు తీసుకునే ఆహారం శక్తినివ్వడమే కాకుండా, కండరాల నష్టం జరగకుండా కాపాడుతుందని చెబుతున్నారు. వ్యాయామానికి 1-2 గంటల ముందు కార్బోహైడ్రేట్లు, తక్కువ ప్రోటీన్ ఉన్న తేలికపాటి ఆహారం తీసుకోవడం మంచిది. ఇది కండరాలకు శక్తినిచ్చి అలసటను తగ్గిస్తుంది, మెరుగైన పనితీరుకు సహాయపడుతుంది. అరటిపండు, ఓట్స్ వంటివి తీసుకోవాలి. వ్యాయామానికి, తర్వాత తగినంత నీరు తాగడం కూడా ముఖ్యం. ఉదయం వ్యాయామం చేసే చెబుతున్నారు.

మల్కాజిగిరి
Volume : 1
Issue No : 1
బుధవారం,
ఫిబ్రవరి 04, 2026
నమస్తే భారత్
తెలుగు దినపత్రిక
NAMASTHE BHARAT TELUGU DAILY


## అవార్డు గ్రహీత డాక్టర్ హేమాక్షికి సన్మానం



**పార్వతిపురం మన్యం జిల్లా. ఫిబ్రవరి 3.:**సీతానగరం, ఫిబ్రవరి 3 : ఉత్తమ ఆయుర్వేద వైద్యాధికారి అవార్డు పొందిన సీతానగరం మండలం బూర్జ ఆయుర్వేద వైద్యశాల వైద్యాధికారిణి డాక్టర్ టి. హేమాక్షి కి ఆయుష్ సిబ్బంది, బూర్జ గ్రామస్థులు మంగళవారం ఘనంగా సన్మానం చేశారు. గ్రామాల్లో విస్తృతంగా వైద్య శిబిరాలు, అవగాహన కార్యక్రమలతో ఆయుర్వేద వైద్య సేవలు అందజేసినందుకుగాను ఆయుష్ శాఖ ప్రాంతీయ ఉప సంచాలకులు ప్రతిపాదనలతో గణతంత్ర దినోత్సవం రోజున జిల్లా కలెక్టర్ డా. ఎన్. ప్రభాకరరెడ్డి చే ఉత్తమ ఆయుర్వేద వైద్యాధికారి అవార్డు పొందిన సందర్భంగా ఆయుష్ సిబ్బంది, గ్రామస్థులు డా. హేమాక్షిని దుశ్శాలువ, పుష్పగుచ్ఛాలతో సత్కరించి సన్మానపత్రం అందజేసారు. ఈ కార్యక్ర మంలో బూర్జ గ్రామ సర్పంచ్ గుజ్జల దాసు, ఆయుష్ సిబ్బంది పద్మ, పైడితల్లి, శ్రీనివాసరావు, విజయ, నాగరాజు, రూప, కుటుంబ సభ్యులు, గ్రామస్థులు తదితరులు పాల్గొన్నారు.

## బైకు అదుపు తప్పి వ్యక్తి మృతి



**ఓదెల: ఫిబ్రవరి 3 :** పెద్దపెల్లి జిల్లా ఓదెల మండలంలోని కొలనురు గ్రామానికి చెందిన మృతుడు సాతూరి సందీప్ తండ్రి తండ్రి పేరు మొండయ్య వయసు 31 సంవత్సరాలు కులం మాదిగ కొలనూరు గ్రామం ఓదెల మండలం అను వ్యక్తి పెద్దపల్లిలోని ఏయు స్మాల్ ఫైనాన్స్ బ్యాంకులో పనిచేయుచున్నాడు ఇంకా పెళ్లి కాలేదు ఉద్యోగరీత్యా ప్రతిరోజు ఉదయం తన ద్విచక్ర వాహనంపై పెద్దపల్లికి వెళ్లి తిరిగి సాయంత్రం కొలనూరుకి వచ్చేవాడు. ఉదయం 8 గంటల ప్రాంతంలో పెద్దపల్లికి డ్యూటీ కి వెళ్ళినాడు రాత్రి 7 గంటల ప్రాంతంలో ఫోన్ చేయగా ఇంటికి వస్తున్నాను అని చెప్పినాడు కానీ రాత్రి 10 గంటల వరకు కూడా ఇంటికి రాకపోయేసరికి ఎన్నిసార్లు ఫోన్ చేసినా ఫోన్ ఎత్తలేదు ఉదయం 5:00 సమ యంలో పాకాల సత్యనారాయణరెడ్డి ఫోన్ చేసి కొలనూరు శివారులోని మూలసాల ఉప్పరపల్లి సర్కిల్ రోడ్డుకి దగ్గరలో గల జంగా ఇంద్రారెడ్డి పొలం వద్ద మృతుడు వాహనంతో సహా రోడ్డుపై నుంచి రోడ్డు కింది వైపుకు వెళ్లి పడిపోగా రక్త గాయాలు అయ్యి చనిపోయినాడు అని చెప్పగా వెళ్లి చూసేసరికి చనిపోయి ఉన్నాడని మృతుని తండ్రి సాతురి మొండయ్య 63 సంవత్సరాలు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని పోత్కపల్లి ఎస్సై దీకొండ రమేష్ తెలిపారు.

## శ్రీ కాళహస్తి దర్శనం కు మంత్రి సంధ్యారాణి కి ఆహ్వానం



**పార్వతీపురం మన్యం జిల్లా, సాలూరు,ఫిబ్రవరి 3, :**ఫిబ్రవరి 15 వ తేదీన శివరాత్రి మహాపర్వదినం.ఈ సందర్భంగా శ్రీకాళహస్తి దేవస్థానానికి విచ్చేసి శ్రీ మల్లికార్జున భ్రమరాంబిక దేవి ఆశీర్వాదాలు పొందాలని శ్రీకాళహస్తి ఎమ్మెల్యే బీజ్జల సుధీర్ రెడ్డి స్త్రీ,శిశు సంక్షేమ శాఖ, గిరిజన శాఖ మంత్రి గుమ్మిడి సంధ్యారాణి తో పాటు మంత్రి సవిత, మంత్రి అనిత,మంత్రి అనగాని సత్యప్రసాద్ ని ప్రత్యేకంగా ఆహ్వానించారు.

## వైసీపీ జిల్లా యువజన విభాగం కార్యవర్గ సభ్యునిగా తోట వాసు నియామకం



**విజయనగరం జిల్లా, ధర్మపురి, ఫిబ్రవరి 3 :**విజయనగరం, ఫిబ్రవరి 3 వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ సంస్థాగత బలోపేతంలో భాగంగా, పార్టీ కేంద్ర కమిటీ
వైయస్ జగన్ మోహన్ రెడ్డి ఆదేశాల మేరకు ఉమ్మడి విజయనగరం జిల్లా పరిషత్ ఛైర్ పర్సన్, వైయస్సార్సీపి జిల్లా అధ్యక్షులు, భీమిలి నియోజకవర్గ సమన్వయ కర్త మజ్జి శ్రీనివాసరావు (చిన్న శ్రీను), జిల్లా యువజన విభాగం కార్యవర్గ సభ్యునిగా తోట వాసును నియమించారు.ఈ నియామకంపై తోట వాసు స్పందిస్తూ, తనపై నమ్మకంతో ఈ బాధ్యతను అప్పగించినందుకు చిన్న శ్రీనుకి, సిరమ్మకి కృతజ్ఞతలు తెలిపారు.

## ఆకోజువెంకటయ్య మృతి గ్రామానికి వారి కుటుంబానికి తీరనిలోటు

- మాజీ ఎమ్మెల్యే కొండేటి శ్రీధర్







**వర్ధన్నపేట ప్రతినిధి ఫిబ్రవరి 3 :**వరంగల్ జిల్లా వర్ధన్నపేట మండలం రామవరం గ్రామానికి చెందిన ప్రముఖ పత్రికలో జర్నలిస్ట్ గా విధులు నిర్వహిస్తున్న ఆకోజు సాంబయ్య తండ్రి ఆకోజు వెంకటయ్య (80) మంగళవారం తెల్లవారుజామున మృతి చెందినట్లు బంధువులు తెలిపారు. ఆకోజువెంకటయ్య వయసు విద్య అనారోగ్యంతో బాధపడుతూ మంగళవారం ఉదయం తుది శ్వాస విడిచినట్లు తెలిపారు. ఆకోజువెంకటయ్య పార్థివ దేహానికి స్థానికులు విచారం వ్యక్తం చేశారు. అందరితో కలివిడిగా మీదిలే వ్యక్తిగా గ్రామంలో మంచి పేరుగాంచిన వ్యక్తి వారి మధ్య నుండి దూరం అవడం అందరిని శోకసముద్రంలో ముంచింది. ఆకోజువె ంకటయ్య అంతిమ సంస్కారంలో పలువురు ప్రజా ప్రతినిధులు జర్నలిస్టులు, వర్ధన్నపేట మాజీ ఎమ్మెల్యే కొండేటి శ్రీధర్, బిజెపి జిల్లా ప్రధాన కార్యదర్శి రాయపురం కుమారస్వామి. కర్క సోమిరెడ్డి మంచోజు సత్యనారాయణ,తెలంగాణ వర్కింగ్ జర్నలిస్టు ఫెడరేషన్ రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు డాక్టర్ పాలడుగుల సురేందర్, స్థానిక ప్రజా ప్రతినిధులు హాజరై వారి కుటుంబానికి ప్రగాఢ సానుభూతి వ్యక్తం చేస్తూ శ్రద్ధాంజలి ఘటించారు.

## విద్యార్థులు ఉపాధ్యాయులుగా అయిన వేళ

**-ఉప్పరపల్లి పాఠశాలలో ఘనంగా స్వయంపాలన దినోత్సవ వేడుకలు**

**-ఆకట్టుకున్న విద్యార్థుల బోధన వేషధారణ**



**చెన్నారావుపేట: 3 ఫిబ్రవరి** వరంగల్ జిల్లా,చెన్నారావుపేట మండలం,ఉప్పరపల్లి ప్రభుత్వ పాఠశాలలో స్వయంపాలన దినోత్సవం ఘనంగా నిర్వహించబడింది.ఈ కార్యక్రమంలో విద్యార్థులు ఉపాధ్యాయులు, అధికారుల పాత్ర లను పోషిస్తూ తమ ప్రతిభను చాటుకున్నారు.ఈ సందర్భంగా విద్యార్థి నాగరాజు డీఈఓగా, ఆర్. కీర్తన హెచ్ఎంగా, మధునిషా ఎంఈఓగా బాధ్యతలు నిర్వహించి అందరి ప్రశంసలు అందు కున్నారు. పాఠశాల నిర్వహణ, తరగతి గదుల పర్యవేక్షణ, ఉపాధ్యాయులతో సమావేశాలు వంటి కార్యక్రమాలను ఎంతో చక్కగా నిర్వహించారు.విద్యార్థుల ప్రదర్శనలు, ప్రసంగాలు, క్రమశిక్షణ అందరినీ ఆకట్టుకున్నాయి.ఈ కార్యక్రమం ద్వారా విద్యార్థుల్లో నాయకత్వ లక్షణాలు, బాధ్యతాభావం మరియు ఆత్మవిశ్వాసం పెంపొందించబడినట్లు హెచ్ఎం తేజావత్ జయ తెలిపారు.పాఠశాల ప్రధానోపాధ్యాయులు,ఉపాధ్యాయులు విద్యార్థు లను అభినందించి, ఇలాంటి కార్యక్రమాలు భవిష్యత్తులో మరింతగా నిర్వహించాలని ఆకాంక్షిం చారు.జడ్జిలుగా ఉపాధ్యా యులు గజవెల్లి సుందర్, వర్దెల్లి సతీష్ కుమార్ వ్యవహా రిం చారు.ఉత్తమ ప్రతిభ కనబరిచిన విద్యార్థుల కు బహుమతులు ప్రధానం చేశారు.

## జాతీయ మహిళా వైద్యుల దినోత్సవం సందర్భంగా సాయి భోజన్

- గర్భిణులకు బాలింతలకు డయాలసిస్ పేషెంట్లకు అన్నదానం
- ప్రభుత్వ ఆసుపత్రిలో కార్యక్రమం
- బాయిజమ్మ సాయి సేవా ట్రస్ట్ ఆధ్వర్యంలో నిర్వహణ



**కొమరంబీమ్ ఆసిఫాబాద్:ఫిబ్రవరి 03. :** సమాజ ఆరోగ్యానికి ప్రాణం పోస్తూ అంకిత భావంతో సేవలందిస్తున్న మహిళా వైద్యమూర్తులందరినీ స్మరిస్తూ జాతీయ మహిళా వైద్యుల దినోత్సవం సందర్భంగా మంచిర్యాల జిల్లా బెల్లంపల్లి ప్రభుత్వ ఆసుపత్రిలో సనాతన ధర్మ బాయి జమ్మ సాయి భక్తి ప్రచార ధార్మిక సేవా ట్రస్ట్ ఆధ్వర్యంలో ట్రస్ట్ దాతల సహకారంతో గర్భిణులకు బాలింతలకు, డయాలసిస్ రోగు లకు, అన్నార్తులకు సాయి భోజన్ అన్నదానం చేసినట్లు ట్రస్ట్ వ్యవస్థాపకులు ప్రముఖ విద్యావేత్తలు డాక్టర్ కాంపల్లి శం కర్ -రాజేశ్వరి తెలిపారు . ఈ సందర్భంగా ఆస్పత్రిలోని, గర్భిణీలు, బాలింతలు, రోగులు, అన్నార్తులు, ఆసుపత్రి సిబ్బంది, సాయి భోజన్ అన్నదాన కార్యక్రమాన్ని వినియోగించుకున్నారు. వారందరూ అన్నదానం చేయడం పట్ల సంతృప్తి వ్యక్తం చేస్తూ, బాయిజమ్మ సాయి సేవా ట్రస్ట్ వారికి మరియు దాతలకు కృతజ్ఞతలు తెలియజేశారు.ట్రస్ట్ ద్వారా "ఆకలితో ఉన్నవారిని అతిథి సత్కారంతో ఆదరిద్దాం-అన్నదానంతో తృప్తి పరుద్దాం" అని ట్రస్ట్ వ్యవస్థాపకులు ప్రముఖ విద్యావేత్తలు డాక్టర్ కాంపల్లి శంకర్-రాజేశ్వరి పిలుపునిచ్చారు. సేవే లక్ష్యం, సేవే మార్గంతో ట్రస్ట్ కొనసాగుతుందని,మానవ సేవే మాధవ సేవ అని త్రవిద్య, శ్రవిద్య, త్రయాక్షర్ సూచించారు ఈ సేవా కార్యక్రమములో ట్రస్ట్ మేనేజర్ బొద్దున సతీష్, సభ్యులు,జేరిపోతుల చంద్రకళ సేవకులు పోతరాజుల తిరుపతి, కొండ శ్రీధర్ ,శ్రీనివాస్ తదిత రులు పాల్గొన్నారని ఒక ప్రకటనలో పేర్కొన్నారు.

## మంగళాదిత్య రాజయోగం.. ఈ 4 రాశుల వారికి ఇక తిరుగుండదు



ఫిబ్రవరి నెలలో ఆకాశంలో అద్భుతమైన గ్రహాల కదలికలు చోటుచేసుకోబోతున్నాయి. జ్యోతిష్య శాస్త్రం ప్రకారం, ఈ మార్పులు కొన్ని రాశుల వారి తలరాతను మార్చేయ బోతున్నాయి. ముఖ్యంగా శతభిషా నక్షత్రం వేదికగా జరగబోయే ఈ గ్రహాల కలయిక రాజయోగంలా మారబోతోంది. జ్యోతిష్య శాస్త్రంలో ఫిబ్రవరి నెలకు ఒక ప్రత్యేక ప్రాముఖ్యత ఉంది. ఈ నెలలో గ్రహాల గమనం చాలా ఆసక్తికరంగా మారబో తోంది.ఫిబ్రవరి 19న సూర్యుడు శతభిషా నక్షత్రంలోకి ప్రవేశిస్తుండగా, మార్చి 3న కుజుడు కూడా అదే నక్షత్రంలో అడుగు పెట్టబోతున్నాడు. ఈ ఇద్దరు శక్తివంతమైన గ్రహాల కలయిక వల్ల మంగళాదిత్య రాజ యోగం ఏర్పడుతోంది. సూర్యుడు అధికా రాన్ని, కుజుడు ధైర్య సాహసాలను సూచి స్తారు. వీరిద్దరూ కలిస్తే ఆ ప్రభావం అమో ఘంగా ఉంటుంది. మార్చి 3వ తేదీ నుంచి ఈ యోగం ప్రభావం ప్రారంభమై, కొన్ని రాశుల వారికి కనకవర్షం కురిపించబోతోంది. ఆ అదృష్ట రాశులు ఏవో ఇప్పుడు చూద్దాం.మేష రాశికి అధిపతి కుజుడు. తన అధిపతి సూర్యుడితో కలవడం వల్ల మేష రాశి వారికి ఈ సమయం బంగారు కాలం అనే చెప్పాలి.ఆఫీసులో మీ ప్రతిభకు గుర్తింపు లభిస్తుంది. కొత్త బాధ్యతలు మీ తలుపు తడతాయి.ప్రభుత్వ ఉద్యోగాల కోసం ప్రయత్నించే వారికి లేదా ప్రభుత్వ కాంట్రాక్టులు చేసే వారికి విశేష లాభాలు ఉంటాయి. మీలో ఆత్మవిశ్వాసం రెట్టింపు అవుతుంది, అసాధ్యమైన పనులను కూడా సునాయాసంగా పూర్తి చేస్తారు.మిథున రాశిమిథున రాశి వారికి ఈ రాజయోగం ఆర్థికంగా గట్టి ఊరటనిస్తుంది.పాత పెట్టుబడుల నుంచి ఊహించని లాభాలు వస్తాయి. సంపాదన మార్గాలు పెరుగుతాయి.విదేశాలకు వెళ్లాలనుకునే వారి కల ఈ సమయంలో నెరవేరుతుంది. సుదీర్ఘ ప్రయాణాలు లాభదాయకంగా మారు తాయి. కోర్టు కేసులు లేదా ఆగిపోయిన ఆస్తుల వ్యవహారాలు ఒక కొలిక్కి వస్తాయి.సింహ రాశిసింహ రాశికి అధిపతి సూర్యుడు. తన నక్షత్ర సంచారంలో కుజుడిని తోడు తీసుకోవడం వల్ల వీరికి తిరుగులేని విజయం లభిస్తుంది.వ్యాపారస్తులు పెద్ద పెద్ద డీల్స్ కుదుర్చుకుంటారు. మార్కెట్‌లో మీ పరపతి పెరుగుతుంది.పరిపాలన, మేనేజ్‌మెంట్ రంగాల్లో ఉన్నవారికి పదోన్నతులు లభించే అవకాశం ఉంది. మీరు తలపెట్టిన ప్రతి పనిలోనూ సానుకూల ఫలితాలు కనిపిస్తాయి. తులా రాశితులా రాశి వారికి ఈ మంగ ళాదిత్య యోగం కెరీర్ పరంగా గొప్ప మార్పులను తెస్తుంది. ప్రత్యర్థులపై మీదే పైచేయి అవుతుంది. మీ తెలివితేటలతో శత్రువులను కూడా మిత్రులుగా మార్చు కుంటారు. పార్టనర్‌షిప్ వ్యాపారాలు చేసే వారికి అద్భుతమైన లాభాలు వస్తాయి. కుటుంబంలో లేదా సమాజంలో మీ గౌరవం పెరుగుతుంది. సంబంధ బాంధవ్యాలు మెరుగుపడతాయి.ఈ మంగళాదిత్య రాజయోగం ఆయా రాశుల వారి జీవితాల్లో కొత్త వెలుగులు నింపబోతోంది.
పట్టుదలగా కృషి చేస్తే, గ్రహబలం తోడై మీరు అనుకున్న లక్ష్యాలను సులభంగా చేరుకోవచ్చు.

# భారత్ టైటిల్‌ను నిలబెట్టుకోవాలని ఆకాంక్షిస్తున్నా..

- పాండ్యా, అర్షదీప్ సింగ్ కీలక పాత్ర పోషిస్తారు
- భారత క్రికెట్ జట్టు కెప్టెన్ రోహిత్ శర్మ వెల్లడి



2026 టీ20 ప్రపంచకప్‌లో భారత్ గెలుపు అవకాశాలపై రోహిత్ శర్మ కీలక విషయాలు మాట్లాడారు. హార్దిక్ పాండ్యా, అర్షదీప్ సింగ్ కీలక పాత్ర పోషిస్తారని, వారి ఆల్ రౌండ్ నైపుణ్యం, డెత్ ఓవర్ల బౌలింగ్‌కు ప్రాధాన్యతనిచ్చారు. స్పిన్ విభాగంలో కుల్దీప్ యాదవ్, వరుణ్ చక్రవర్తి సవాల్‌గా మారతారని, వికెట్ తీసే బౌలర్లకే తన మద్దతు ఉంటుందని స్పష్టం చేశారు.భారత్, శ్రీలంక సంయుక్తంగా ఆతిథ్యం ఇవ్వనున్న 2026 టీ20 ప్రపంచకప్‌లో టీమిండియా గెలుపు అవకాశాలపై భారత క్రికెట్ జట్టు కెప్టెన్ రోహిత్ శర్మ ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. ఈ మెగా టోర్నీలో భారత్ టైటిల్‌ను నిలబెట్టుకోవాలని ఆకాంక్షించారు. జట్టులో హార్దిక్ పాండ్యా, అర్షదీప్ సింగ్ పాత్ర అత్యంత కీలకమని రోహిత్ నొక్కి చెప్పారు. ముఖ్యంగా హార్దిక్ పాండ్యా అందించే ఆల్ రౌండ్ బ్యాలెన్స్ కెప్టెన్ సూర్యకుమార్ యాదవ్‌కు పెద్ద ఊరటనిస్తుందని తెలిపారు. అర్షదీప్ సింగ్ డెత్ ఓవర్లలో అద్భుతమైన నైపుణ్యాన్ని ప్రదర్శిస్తాడని, 2024 ఫైనల్‌లో అతని ప్రదర్శనను ప్రశంసించారు. స్పిన్ విభాగంలో కుల్దీప్ యాదవ్, వరుణ్ చక్రవర్తి సవాల్‌గా మారతారని పేర్కొన్న రోహిత్..

# కొలంబోలో అడుగుపెట్టిన పాకిస్తాన్ టీమ్

**వివాదాల మధ్యే శ్రీలంకకు పాకిస్తాన్ జట్టు**

**ఫిబ్రవరి 7న నెదర్లాండ్స్‌తో తొలి మ్యాచ్**



ఐసీసీ టీ - 20 వరల్డ్ కప్ 2026 కోసం పాకిస్తాన్ జట్టు కొలంబో చేరుకుంది. అయితే, భారత్‌తో మ్యాచ్‌ను బాయ్‌కాట్ చేయాలనే ప్రభుత్వ ఆదేశాలతో క్రికెట్ వర్గాల్లో తీవ్ర చర్చ జరుగుతోంది. ఈ నిర్ణయం వల్ల పాకిస్తాన్ ఆర్థికంగా నష్టపోవడంతో పాటు టోర్నీ ఆదాయంపై కూడా ప్రభావం పడనుంది. మాజీ ఆటగాళ్లు ప్రభుత్వ నిర్ణయానికి మద్దతు తెలుపుతుండగా, ఐసీసీ పునరాలోచించాలని సూచించింది. ఫిబ్రవరి 15న అసలు ఏం జరుగుతుందో చూడాలి!ఐసీసీ టీ20 వరల్డ్‌కప్ 2026కు ముందు పాకిస్తాన్ జట్టు శ్రీలంక రాజధాని కొలంబోకు చేరుకుంది. భారత్‌తో జరగాల్సిన కీలక మ్యాచ్‌ను బాయ్‌కాట్ చేసే అంశంపై కొనసాగుతున్న వివాదాల మధ్యే పాకిస్తాన్ జట్టు శ్రీలంకకు రావడం ప్రస్తుతం క్రికెట్ వర్గాల్లో చర్చనీయాంశంగా మారింది.సల్మాన్ అలీ ఆఘా నాయకత్వంలో ఉన్న 15 మంది సభ్యుల పాకిస్తాన్ జట్టు సోమవారం కొలంబో చేరుకుంది. భారత జట్టుతో ఫిబ్రవరి 15న జరగాల్సిన మ్యాచ్‌లో పాల్గొనవద్దని పాకిస్తాన్ ప్రభుత్వం ఆదేశాలు జారీ చేయడంతో, ఈ నిర్ణయం చుట్టూ పెద్ద ఎత్తున వివాదం నెలకొంది.టోర్నీకి ముందు సన్నాహాలపై ప్రస్తుతం పాకిస్తాన్ జట్టు దృష్టి సారించింది. మంగళవారం ఆటగాళ్లకు విశ్రాంతి ఇచ్చిన జట్టు, బుధవారం ఐర్లాండ్‌తో జరిగే ఏకైక వార్మప్ మ్యాచ్‌లో పాల్గొననుంది. ఈ మ్యాచ్ సింహాలీస్ స్పోర్ట్స్ క్లబ్ మైదానంలో జరగనుంది. ఇదే మైదానం గ్రూప్-ఏలో పాకిస్తాన్ ఆడే మూడు మ్యాచ్‌లకు వేదిక కానుంది.గ్రూప్-ఏలో పాకిస్తాన్‌తో పాటు డిఫెండింగ్ ఛాంపియన్ భారత్, అమెరికా, నెదర్లాండ్స్, నమీబియా జట్లు ఉన్నాయి. పాకిస్తాన్ ఫిబ్రవరి 7న నెదర్లాండ్స్‌తో తమ తొలి మ్యాచ్ ఆడనుంది. అయితే భారత్ మ్యాచ్ బాయ్‌కాట్ అంశంపై పాకిస్తాన్ క్రికెట్ బోర్డు ప్రస్తుతం కఠిన పరిస్థితుల్లో చిక్కుకుంది. ఈ నిర్ణయాన్ని పునరాలోచించాలని ఐసీసీ ఇప్పటికే సూచించినట్లు సమాచారం. భారత్‌తో మ్యాచ్ ఆడకపోతే పాకిస్తాన్ భారీ ఆర్థిక నష్టాన్ని ఎదుర్కొనే అవకాశం ఉందని ఐసీసీ హెచ్చరిస్తున్నట్లు తెలుస్తోంది.భారత్--పాకిస్తాన్ మ్యాచ్ జరగకపోతే టోర్నీ ఆదాయంపై కూడా తీవ్ర ప్రభావం పడనుంది. ప్రసార హక్కుల సంస్థ జియోస్టార్ ఇప్పటికే తమ ఒప్పందంపై పునర్విమర్శ కోరుతున్నట్లు వార్తలు వస్తున్నాయి. ఈ మ్యాచ్ లేకపోతే ప్రకటనల ద్వారా రూ.200 నుంచి రూ.250 కోట్ల వరకు నష్టం వాటిల్లే అవకాశముందని పరిశ్రమ వర్గాలు అంచనా వేస్తున్నాయి. 10 సెకన్ల ప్రకటనకు రూ.40 లక్షల వరకు వసూలు చేసే స్థాయిలో ఈ మ్యాచ్‌కు ఆదరణ ఉంది.మాజీ కెప్టెన్లు షాహిద్ అఫ్రిది, మహమ్మద్ యూసుఫ్, రషీద్ లతీఫ్, మొయిన్ ఖాన్, సర్ఫరాజ్ అహ్మద్, మొహ్సిన్ ఖాన్ లాంటి పలువురు మాజీ క్రికెటర్లు ప్రభుత్వ నిర్ణయానికి మద్దతు తెలుపుతూ వ్యాఖ్యలు చేశారు. ఇప్పటికే టోర్నీ ప్రారంభానికి సమయం దగ్గర పడుతుండటంతో, పాకిస్తాన్ తుది నిర్ణయం ఏవిధంగా ఉంటుందన్నది అంతర్జాతీయ క్రికెట్ వర్గాల్లో ఆసక్తిగా మారింది.

# సందిగ్ధంలో సంజూ శాంసన్ కెరీర్



టీ20 ప్రపంచకప్ 2026 ముంగిట టీమిండియా స్టార్ వికెట్ కీపర్ బ్యాటర్ సంజూ శాంసన్ కెరీర్ ఇప్పుడు ఒక సందిగ్ధంలో పడింది. కివీస్‌తో జరిగిన సిరీస్‌లో ఘోరంగా విఫలమైన సంజూకి, సౌతాఫ్రికాతో జరగబోయే వార్మప్ మ్యాచ్ ఇప్పుడు చావోరేవో లాంటిది. ఈ ఒక్క మ్యాచ్‌లో సంజూ మెరిస్తేనే మెయిన్ టీమ్‌లో చోటు దక్కుతుంది, లేదంటే బెంచ్‌కే పరిమితం కాక తప్పదు. టీ20 ప్రపంచకప్ ప్రారంభానికి ముందు సంజూ శాంసన్ ఫామ్ భారత క్రికెట్ అభిమానులను తీవ్రంగా కలవరపెడుతోంది. న్యూజిలాండ్‌తో జరిగిన ఐదు మ్యాచ్‌ల సిరీస్‌లో సంజూ దారుణంగా విఫలమయ్యాడు. ఐదు మ్యాచ్‌ల్లో కలిపి కేవలం 46 పరుగులు మాత్రమే చేసి, 9.2 సగటుతో తన దయనీయ స్థితిని చాటుకున్నాడు. అదే సమయంలో జట్టులోకి వచ్చిన ఈషాన్ కిషన్ కేవలం నాలుగు మ్యాచ్‌ల్లోనే ఒక సెంచరీ, ఒక హాఫ్ సెంచరీతో 215 పరుగులు బాదేసి, తన స్థానాన్ని ఖాయం చేసుకున్నాడు. ఇప్పుడు సంజూ గనుక తనను తాను నిరూపించుకోకపోతే ప్లేయింగ్ ఎలెవన్ నుంచి ఉద్వాసన తప్పదు. బుధవారం నవీ ముంబై వేదికగా సౌతాఫ్రికాతో భారత్ వార్మప్ మ్యాచ్ ఆడనుంది. విచిత్రం ఏమిటంటే.. ఇది కేవలం ప్రాక్టీస్ మ్యాచ్ అయినప్పటికీ దాదాపు 35 వేల టికెట్లు అమ్ముడైపోయాయి. స్టేడియం మొత్తం హౌస్‌ఫుల్ కాబోతోంది. ఇంత భారీ జనం మధ్య సంజూ గనుక మెరుపు ఇన్నింగ్స్ ఆడితే, సెలెక్టర్ల మనసు మళ్లీ మారే అవకాశం ఉంది. ఈ మ్యాచ్‌లో సంజూకి అవకాశం దక్కుతుందా? దక్కితే దాన్ని వినియోగించుకుంటాడా? అన్నదే ఇప్పుడు మిలియన్ డాలర్ల ప్రశ్న. ప్రపంచకప్ ఆరంభంలో భారత్ జట్టు యూఎస్ఏ, నమీబియా వంటి చిన్న జట్లతో తలపడనుంది. ఆ మ్యాచ్‌ల్లో చోటు దక్కాలంటే సౌతాఫ్రికాపై సంజూకి మంచి స్కోరు అవసరం. ఈషాన్ కిషన్ ఫుల్ ఫామ్‌లో ఉండటం వల్ల ఓపెనింగ్‌లో రోహిత్, విరాట్ స్థానాల తర్వాత కిషన్ పేరు వినిపిస్తోంది. సంజూ గనుక మిడిల్ ఆర్డర్‌లో సత్తా చాటకపోతే, టీమ్ కాంబినేషన్ నుంచి అతడిని పక్కన పెట్టడం ఖాయం. ఒకరకంగా చెప్పాలంటే సంజూ శాంసన్‌కు ఇది ఫైనల్ లాంటి పరీక్ష. సంజూ శాంసన్ టాలెంట్ పై ఎవరికీ అనుమానం లేదు, కానీ నిలకడలేమి అతడిని ఎప్పుడూ ఇబ్బంది పెడుతోంది. గత రెండేళ్లుగా ఐపీఎల్‌లో బాగా ఆడుతున్నప్పటికీ, బ్లూ జెర్సీలో సంజూ ఇంకా తన ముద్ర వేయలేకపోయాడు. మరోవైపు యువ ఆటగాళ్ల పోటీ పెరిగిపోవడంతో సంజూకి ఈ సౌతాఫ్రికా మ్యాచ్ మలుపుగా మారాలి. ఇక్కడ రన్స్ వస్తే సంజూ హీరో, లేదంటే ప్రపంచకప్ ఆశలు గాలిలో దీపంలా మారుతాయి.



# తారాజువ్వలా ఇషాన్ కిషన్

- గత 4 మ్యాచ్‌ల్లోనూ అదరగొట్టిన ఇషాన్
- టి20 ప్రపంచకప్‌లో ఓపెనర్‌గా బరిలోకి!?
- అభిషేక్ తో ఇన్నింగ్స్ ప్రారంభించే చాన్స్

టి20 ప్రపంచకప్ 2026 వచ్చే శనివారం ఆరంభం కానుంది. ఫిబ్రవరి 7 నుంచి మార్చి 8 వరకు ఈ టి20 ప్రపంచకప్ జరగనుంది. ఈసారి మెగా టోర్నీలో పాల్గొనే జట్ల సంఖ్య పెరిగింది. మొత్తం 20 జట్లు పాల్గొంటున్నాయి. భారత్ గ్రూప్ 'ఎ'లో ఉంది. ఇదే గ్రూప్‌లో నెదర్లాండ్స్, నమీబియా, అమెరికా, పాకిస్తాన్ జట్లు కూడా ఉన్నాయి. ఈ టి20 ప్రపంచకప్ జట్టులో డిఫెండింగ్ ఛాంపియన్ హోదాలో భారత జట్టు బరిలోకి దిగుతోంది. 2007లో టి20 ప్రపంచకప్ మొదటిసారి జరగ్గా.. టీమిండియా విశ్వవిజేతగా నిలిచింది. ఇక ఆ తర్వాత 2024లో టి20 ప్రపంచకప్ నెగ్గింది. ప్రస్తుతం భారత జట్టు పటిష్టంగా ఉంది. టి20 ప్రపంచకప్ ముందు ఒక బ్యాటర్ ప్రత్యర్థులను వణికిస్తున్నాడు. ఇటీవలె న్యూజిలాండ్‌తో జరిగిన టి20 సిరీస్‌లో ఎవరూ ఊహించని విధంగా ఇషాన్ కిషన్ రెచ్చిపోయాడు. తిలక్ వర్మ గాయం కారణంగా ఆ సిరీస్‌కు దూరమయ్యాడు. ఫలితంగా భారత జట్టుకు దూరమయ్యాడు. దాంతో అతడి స్థానంలో ఇషాన్ కిషన్ తుది జట్టులోకి వచ్చాడు. మొత్తం 4 మ్యాచ్‌ల్లోనూ అదరగొట్టాడు. ఒక సెంచరీ.. మరో అర్ధ సెంచరీ బాదాడు.ఇక అదే సమయంలో సంజూ సామ్సన్ పేలవ ప్రదర్శన చేశాడు. ఫలితంగా ఫిబ్రవరి 7 నుంచి ఆరంభమయ్యే టి20 ప్రపంచకప్‌లో టీమిండియా ఓపెనర్‌గా ఇషాన్ కిషన్ బరిలోకి దిగే అవకాశం ఉంది. ప్రస్తుతం అతడు సూపర్ ఫామ్‌లో ఉండటంతో టీమ్ మేనేజ్‌మెంట్ అతడిపై నమ్మకం ఉంచింది. ఇప్పటికే అభిషేక్ శర్మ రూపంలో టీమిండియాకు పవర్ ఫుల్ ఓపెనర్ ఉన్నాడు. అతడికి ఇషాన్ తోడైతే ప్రపంచకప్‌లో టీమిండియాను ఆపడం ఎవరి తరం కాదు. 2023లో ఇషాన్ కిషన్ తారాజువ్వలా దూసుకొచ్చాడు. ఆ ఏడాది జరిగిన ఆసియా కప్‌లో అదరగొట్టాడు. దాంతో వన్డే ప్రపంచకప్ జట్టుకు ఎంపికయ్యాడు. అయితే అతడికి ప్లేయింగ్ ఎలెవెన్‌లో అవకాశాలు రాలేదు. అనంతరం అతడు తీసుకున్న తొందరపాటు నిర్ణయాల వల్ల రెండేళ్లపాటు ఆటకు దూరమయ్యాడు.2025 నుంచి అతడి ఆటతీరు మారింది.గతేడాది జరిగిన సయ్యద్ ముస్తాక్ అలీ ట్రోఫీలో జార్ఖండ్ జట్టుకు కెప్టెన్‌గా ఉన్నాడు. సంచరీల మీద సెంచరీలు బాదాడు. తన జట్టును ఛాంపియన్‌గా నిలబెట్టాడు. అనంతరం జరిగిన విజయ్ హజారే ట్రోఫీలో కూడా రాణించాడు. ఫలితంగా అతడికి బీసీసీఐ నుంచి పిలుపొచ్చింది. బ్యాకప్ వికెట్ కీపర్‌తో పాటు బ్యాకప్ ఓపెనర్‌గా అతడిని తీసుకున్నారు.ఇక కివీస్‌తో జరిగిన టి20 సిరీస్‌లో సంజూ సామ్సన్ విఫలం కావడం.. ఇషాన్ కిషన్ రెచ్చిపోవడంతో టీమిండియా ప్లేయింగ్ ఎలెవెన్ సమీకరణాలు మారిపోయాయి. టి20 ప్రపంచకప్‌లో ఇషాన్ కిషన్ ఓపెనర్‌గా బరిలోకి దిగనున్నాడు.

# ద్రవిడ్ సేన ముందు గంభీర్ టీమ్ జుజుబీ

- టీమిండియా మాజీ క్రికెటర్ అనిల్ కుంబ్లే

ఐసీసీ టీ20 ప్రపంచకప్ 2026 టోర్నీ ప్రారంభానికి ముందు టీమిండియా మాజీ క్రికెటర్ అనిల్ కుంబ్లే ఆసక్తికర వ్యాఖ్యలు చేశాడు. గత టీ20 ప్రపంచకప్ 2024లో విజేతగా నిలిచిన భారత జట్టుతో పోల్చితే ప్రస్తుత టీమ్ బలంగా ఉన్నప్పటికీ, చాలా విషయాల్లో వెనుకంజలో ఉందన్నాడు. రాహుల్ ద్రవిడ్ పర్యవేక్షణలోని రోహిత్ సేన.. ప్రస్తుత గంభీర్ పర్యవేక్షణలో సూర్య టీమ్ కంటే గొప్పదని అభిప్రాయపడ్డాడు. ఐసీసీ టీ20 ప్రపంచకప్ 2024 టోర్నీలో రోహిత్ శర్మ సారథ్యంలో భారత జట్టు విజేతగా నిలిచిన సంగతి తెలిసిందే. ఈ గెలుపుతో 11 ఏళ్ల ఐసీసీ టైటిల్ నిరీక్షణకు రోహిత్ సేన తెరదించింది. సౌతాఫ్రికాతో ఉత్కంఠగా సాగిన ఫైనల్లో విజయం సాధించిన భారత్ రెండో టీ20 ప్రపంచకప్ టైటిల్‌ను ముద్దాడింది. కీలకమైన సమయాల్లో రోహిత్ శర్మ, విరాట్ కోహ్లీ, రవీంద్ర జడేజా అనుభవం భారత విజయానికి కలిసొచ్చింది.ఈ విజయానంతరం ఈ ముగ్గురు ఆటగాళ్లు అంతర్జాతీయ టీ20లకు వీడ్కోలు పలికారు. దాంతో భారత టీ20 క్రికెట్‌లో ఒక శకం ముగిసింది. సూర్యకుమార్ యాదవ్ సారథ్యంలో మరో జట్టు రెడీ అయ్యింది. గత రెండేళ్లలో 9 ద్వైపాక్షిక సిరీస్‌లను సూర్యసేన గెలిచి హాట్ ఫేవరేట్‌గా బరిలోకి దిగుతోంది. తాజాగా అధికారిక బ్రాడ్‌కాస్టర్ షోలో మాట్లాడిన అనిల్ కుంబ్లే.. రోహిత్ సేన గొప్పదని అభిప్రాయపడ్డాడు. 'అనుభవం గురించి మాట్లాడితే టీమిండియా ఇద్దరు దిగ్గజ ఆటగాళ్లను కోల్పోయింది. విరాట్ కోహ్లీ, రోహిత్ శర్మ రిటైర్మెంట్ ప్రకటించారు. జట్టు సమతూకం గురించి మాట్లాడితే సూర్యసేన బలంగా ఉంది. ఎందుకంటే ఈ జట్టులో చాలా బౌలింగ్ ఆప్షన్స్ ఉన్నాయి. బ్యాటింగ్‌లో దూకుడైన అప్రోచ్‌తో భీకరంగా కనిపిస్తోంది. అయితే ఈ టోర్నీ సవాల్‌గా ఉంటుంది. 2024లో పరిస్థితులు చాలా భిన్నంగా ఉన్నాయి. ఈ జట్టు కంటే రోహిత్ సేన 10 శాతం ముందుందని చెబుతాను. 2024 టీ20 ప్రపంచకప్ ఫైనల్లో విరాట్ కోహ్లీ, అక్షర్ పటేల్ తీవ్ర ఒత్తిడిలో మెరుగైన ప్రదర్శన కనబర్చారు.

# సరికొత్త చరిత్ర సృష్టించిన దీప్తి శర్మ



అంతర్జాతీయ మహిళల క్రికెట్‌లో భారత స్టార్ ఆల్‌రౌండర్ దీప్తి శర్మ సరికొత్త చరిత్ర సృష్టించింది. ఐసీసీ తాజాగా విడుదల చేసిన టీ20 బౌలింగ్ ర్యాంకింగ్స్‌లో దీప్తి శర్మ ప్రపంచ నంబర్ 1 స్థానాన్ని కైవసం చేసుకుంది. తన కెరీర్‌లో ఈ అరుదైన మైలురాయిని అందుకోవడం ఇదే తొలిసారి. మరోవైపు టీమిండియా ఓపెనర్ స్మృతి మంధానకు వన్డే ర్యాంకింగ్స్‌లో నిరాశ ఎదురైంది. విశాఖపట్నంలో శ్రీలంకతో జరిగిన తొలి టీ20 మ్యాచ్‌లో దీప్తి శర్మ అద్భుత ప్రదర్శన చేసింది. కేవలం 20 పరుగులు ఇచ్చి ఒక కీలక వికెట్ పడగొట్టడంతో పాటు పొదుపుగా బౌలింగ్ చేసింది. ఈ ప్రదర్శనతో ఆమెకు 737 రేటింగ్ పాయింట్లు లభించాయి. తద్వారా ఆస్ట్రేలియా పేసర్ అనాబెల్ సదర్‌ల్యాండ్ (736)ను ఒక్క పాయింట్ తేడాతో వెనక్కి నెట్టి దీప్తి అగ్రస్థానానికి చేరుకుంది. 2025 వన్డే ప్రపంచకప్‌లో ప్లేయర్ ఆఫ్ ది టోర్నమెంట్?గా నిలిచిన దీప్తి, ఇప్పుడు టీ20ల్లోనూ తన ఆధిపత్యాన్ని చాటుకుంది. వన్డే బ్యాటింగ్ ర్యాంకింగ్స్‌లో భారత స్టార్ ఓపెనర్ స్మృతి మంధాన తన అగ్రస్థానాన్ని కోల్పోయింది. సౌతాఫ్రికా కెప్టెన్ లారా వోల్వార్డ్, ఐర్లాండ్‌తో జరిగిన సిరీస్‌లో వరుస సెంచరీలు బాది 820 రేటింగ్ పాయింట్లతో నంబర్-1 స్థానానికి చేరుకుంది. దీనితో స్మృతి 811 పాయింట్లతో రెండో స్థానానికి పడిపోయింది. అయితే టీ20 బ్యాటింగ్ ర్యాంకింగ్స్‌లో మాత్రం స్మృతి మూడో స్థానంలో కొనసాగుతూ తన సత్తా చాటుతోంది. టీ20 బ్యాటింగ్ విభాగంలో జెమీమా రోడ్రిగ్స్ భారీగా పుంజుకుంది. శ్రీలంకపై 44 బంతుల్లో 69 పరుగులతో అజేయంగా నిలిచి ప్లేయర్ ఆఫ్ ది మ్యాచ్?గా ఎంపికైన జెమీమా, ఏకంగా ఐదు స్థానాలు ఎగబాకి 9వ ర్యాంకుకు చేరుకుంది. ప్రస్తుతం టీ20 బ్యాటింగ్ టాప్-10లో స్మృతి మంధాన (3), జెమీమా రోడ్రిగ్స్ (9), షెఫాలీ వర్మ (10) ముగ్గురు భారత క్రీడాకారిణులు ఉండటం విశేషం. భారత పేసర్ అరుంధతి రెడ్డి కూడా తన ర్యాంకింగ్‌ను మెరుగుపరుచుకుంది. ఐదు స్థానాలు మెరుగుపరుచుకుని 36వ ర్యాంకుకు చేరుకుంది. ఇక ఆల్‌రౌండర్ విభాగంలో దీప్తి శర్మ మూడో స్థానంలో ఉండగా, వెస్టిండీస్ కెప్టెన్ హేలీ మాథ్యూస్ అగ్రస్థానంలో కొనసాగుతోంది. సౌతాఫ్రికా ప్లేయర్ సునే లూస్ కూడా బ్యాటింగ్, ఆల్‌రౌండర్ విభాగాల్లో గణనీయమైన వృద్ధిని సాధించింది.



# తారక్‌తోనే గాడ్ ఆఫ్ వార్

గాడ్ ఆఫ్ వార్ ..టాలీవుడ్ లో ఈ సినిమా చుట్టూ నడుస్తున్న డిస్కషన్ మరే సినిమాకు ఇటీవల కాలంలో జరగలేదేమో. మొదట ఈ సినిమా అల్లు అర్జున్ హీరోగా త్రివిక్రమ్ డైరెక్షన్ లో వస్తుందని ప్రకటించారు. కానీ బన్నీ నటించిన పుష్ప తర్వాత సీన్ మారింది. పాన్ ఇండియా మార్కెట్ పై కన్నేసిన బన్నీ తెలుగు దర్శకులతో సినిమా చేసే ఇంట్రెస్ట్ చూపలేదు. దాంతో త్రివిక్రమ్ ఈ కథని ఎన్టీఆర్ చేయాలనీ డిసైడ్ అయ్యాడు. ఎన్టీఆర్ కు కథ చెప్పడం అందుకు ఓకే చెప్పడం కూడా జరిగింది. ఎన్టీఆర్ కూడా కుమారస్వామికు సంబంధించి బుక్ ను చదువుతూ మీడియా కంటపడంతో త్రివిక్రమ్ ఎన్టీఆర్ సినిమా ఫిక్స్ అని న్యూస్ హల్ చల్ చేసాయి. యుద్దానికి అధిపతిగా, దైవ స్వరూపంగా తారక్ నటన మరియు ఆయన స్క్రీన్ ప్రెజెన్స్ ఈ సినిమాకు ప్రధాన ఆకర్షణగా నిలుస్తాయని ఫ్యాన్స్ ఫుల్ ఖుషి అయ్యారు. ఇంతకుముందు ఎన్నడూ చూడని విధంగా ఒక విజువల్ గ్రాండియర్‌గా త్రివిక్రమ్ ఈ కథను సిద్ధం చేసాడని టాక్ వినిపించింది. కానీ మొన్నామధ్య ఈ సినిమాని అల్లు అర్జున్ చేయాలనుకుంటున్నట్టు బాలీవుడ్ మీడియాతో ఫేక్ ప్రాపగాండా చేశారు. దాంతో అసలు ఈ సినిమా ఎవరితో ఉంటుందా అని కన్ఫ్యూజ్ అయ్యారు సినిమా ప్రేక్షకులు. ఇక ఇప్పుడు లేటెస్ట్ గా అన్ని గందరగోళాల తర్వాత చివరికి తారక్ వద్దకు వచ్చి చేరింది. ప్రస్తుతం ఎన్టీఆర్ చేస్తున్న ప్రశాంత్ నీల్ సినిమా జూన్ 2026 నాటికి పూర్తి కానుంది. ఆ వెంటనే అంటే 'గాడ్ ఆఫ్ వార్ సెట్స్‌పైకి వెళ్లే అవకాశం ఉంది. ఈ లోపు త్రివిక్రమ్ ప్రస్తుతం చేస్తున్న వెంకీ సినిమా పూర్తి చేసి, ఈ పౌరాణిక చిత్రం కోసం ప్రీ-ప్రొడక్షన్ పనులను పక్కాగా సిద్ధం చేస్తున్నారు. హారిక హాసిని క్రియేషన్స్ మరియు సితార ఎంటర్‌టైన్‌మెంట్స్ సంయుక్తంగా ఈ సినిమాను పాన్-వరల్డ్ స్థాయిలో విడుదల చేయడానికి ప్లాన్ చేస్తున్నాయి.

# భాగ్యశ్రీ 'పానీపూరి' పంచ్

అందం ఉంది... ప్రతిభ ఉంది.. కానీ లక్ కలిసి రావడం లేదు... దీంతో వరుస ఫ్లాపులు ఎదుర్కొని డీలా పడిపోయింది భాగ్యశ్రీ. అయితే ప్రతి ఫ్లాప్ నుంచి అంతో ఇంతో నేర్చుకుంటున్న ఈ బ్యూటీ ప్రతి సినిమాలో నటన పరంగా ఫైన్ అవుతూనే ఉంది. సినిమాలు ఫ్లాపులైనా కానీ, నటిగా ఏనాడూ భాగ్యశ్రీ ఫ్లాప్ కాలేదు. అందుకే ఈ భామకు బ్యాక్ టు బ్యాక్ అవకాశాలు వస్తున్నాయి. మాస్ మహారాజా రవితేజ సరసన -మిస్టర్ బచ్చన్- సినిమాతో డెబ్యూ ఇచ్చిన ఈ బ్యూటీ ఆరంభమే పెద్ద ఫ్లాప్ ని ఎదుర్కొంది. ఆ తర్వాత విజయ్ దేవరకొండ సరసన నటించిన -కింగ్ డమ్- మరో పెద్ద నిరాశ. ఇటీవలే విడుదలైన రామ్ పోతినేని -ఆంధ్రా కింగ్ తాలూకా- అయినా తనను గట్టున పడేస్తుందని చాలా ఆశించింది. కానీ మరోసారి నిరాశే ఎదురైంది. ఈ సినిమాకి విమర్శకుల నుంచి ప్రశంసలు వచ్చినా, భాగ్యశ్రీ- రామ్ జంట కెమిస్ట్రీకి మంచి మార్కులే వేసినా కానీ, ఆశించిన స్థాయి విజయం దక్కలేదు. ఇది కేవలం యావరేజ్ గా మాత్రమే మిగిలిపోవడం మరోసారి భాగ్యశ్రీని కుంగదీసింది. వరుస పరాజయాల కెరీర్ లో దుల్కర్ సల్మాన్ సరసన నటించిన కాంత ఫలితం కొంత ఊరట. ఈ సినిమా బాక్సాఫీస్ వద్ద యావరేజ్ విజయం సాధించినా, ఇందులో భాగ్యశ్రీ నట ప్రదర్శనకు క్రిటిక్స్ మంచి మార్కులు వేసారు. భాగ్యశ్రీ ఫ్లాపులు, యావరేజుల్లో నటించినా కానీ తన నటప్రదర్శన విషయంలో నిరాశపరచలేదనే మంచి పేరు తెచ్చుకుంది. ఇప్పటికీ గెలుపుపై పట్టుదలగా కనిపిస్తోంది. హోప్‌ని విడిచిపెట్టలేదు. ప్రస్తుతం అఖిల్ అక్కినేని సరసన -లెనిన్- అనే చిత్రంలో నటిస్తోంది ఈ బ్యూటీ. ఇది విలేజ్ బ్యాక్ డ్రాప్ సినిమా అయినా ఇందులో భాగ్యశ్రీ పాత్రకు చాలా ప్రాధాన్యత ఉందని తెలుస్తోంది. భాగ్యశ్రీ ప్రస్తుతం సోషల్ మీడియాల్లో స్పీడ్ గానే ఉంది. అయితే ఈ భామ ఎప్పుడూ హద్దు మీరని, డీసెంట్ ఫోటోషూట్లతో అభిమానుల్లో ఒక ప్రత్యేకమైన గుర్తింపును తెచ్చుకుంది. తాజాగా మరోసారి అలాంటి ఒక ఫోటోషూట్ తో అభిమానుల ముందుకు వచ్చింది.





# ఉస్తాద్.. ఇంకెప్పుడు క్లారిటీ వచ్చేది..?

పవర్ స్టార్ పవన్ కళ్యాణ్ అభిమానులు ఎంతో ఆసక్తిగా ఎదురుచూస్తున్న చిత్రం ఉస్తాద్ భగత్ సింగ్. హరీష్ శంకర్ దర్శకత్వంలో తెరకెక్కుతున్న ఆ యాక్షన్ ఎంటర్టైనర్ మూవీ షూటింగ్ పూర్తి చేసుకుని రిలీజ్ కు రెడీగా ఉన్నా.. విడుదల తేదీ మాత్రం ఇంకా ఫిక్స్ కాకపోవడం హాట్ టాపిక్ గా మారింది. ముఖ్యంగా బాబాయ్ కోసం అబ్బాయి వెయిటింగ్ అన్నట్టుగా సినిమా పరిస్థితి మారిందన్న చర్చ ఇండస్ట్రీలో వినిపిస్తోంది.

ముందుగా సినిమాను సమ్మర్ లో విడుదల చేస్తామని మేకర్స్ ప్రకటించారు. ఆ మేరకు పోస్ట్ ప్రొడక్షన్ పనులు కూడా వేగంగా పూర్తి చేస్తున్నారు. రీసెంట్ గా దర్శకుడు హరీష్ శంకర్, నిర్మాతలు డబ్బింగ్ పనులకు శ్రీకారం చుట్టారు. త్వరలోనే పవన్ కళ్యాణ్ కూడా తన డబ్బింగ్ పార్ట్ ను పూర్తి చేయనున్నారని సమాచారం. ఆర్ఆర్, ఫైనల్ మిక్సింగ్ పూర్తయితే సినిమా పూర్తిగా రిలీజ్ కు సిద్ధమవుతుంది.టెక్నికల్ గా అన్నీ రెడీ అయినప్పటికీ అసలు అడ్డంకి రిలీజ్ డేట్ దగ్గరే. మార్చి నెలలో వరుసగా పాన్ ఇండియా సినిమాలు థియేటర్లకు క్యూ కడుతుండటంతో మేకర్స్ తర్జనభర్జనలు పడుతున్నారు. ధురంధర్ 2, టాక్సిక్, ప్యారడైజ్, పెద్ది వంటి భారీ చిత్రాలు ఇప్పటికే తమ తేదీలను లాక్ చేసుకున్నాయి. అంతటి పోటీలో ఉస్తాద్ భగత్ సింగ్ ను తీసుకురావడం రిస్క్‌గా భావిస్తున్నట్లు తెలుస్తోంది.మరోవైపు రామ్ చరణ్ హీరోగా తెరకెక్కుతున్న పెద్ది సినిమా రిలీజ్ డేట్ ఇంకా ఫైనల్ కాలేదు. మార్చి 27న రావాల్సిన ఆ చిత్రం వాయిదా పడే అవకాశాలు ఉన్నాయనే టాక్ వినిపిస్తోంది. దీంతో పెద్ది టీమ్ కొత్త తేదీ ప్రకటించే వరకు ఉస్తాద్ టీమ్ వేచి చూస్తోందని సమాచారం. అంటే బాబాయ్ పవన్ కళ్యాణ్ సినిమా రిలీజ్ కోసం అబ్బాయి రామ్ చరణ్ సినిమా డేట్ క్లారిటీ కోసం వెయిట్ చేస్తున్నట్టు పరిస్థితి కనిపిస్తోంది.పెద్ది వాయిదా పడితే అదే తేదీని ఉస్తాద్ భగత్ సింగ్ లాక్ చేసే ఛాన్స్ ఉందని ట్రేడ్ వర్గాలు చెబుతున్నాయి. అందుకే అధికారిక ప్రకటన ఆలస్యమవుతోందని అంటున్నారు. అవుట్ పుట్ విషయంలో ఎక్కడా రాజీ పడకుండా క్వాలిటీపై దృష్టి పెట్టిన మేకర్స్ సరైన రిలీజ్ విండో కోసం ఎదురుచూస్తున్నారు. మొత్తంగా సినిమా సిద్ధంగా ఉన్నా.. సరైన సమయం కోసం ఎదురుచూపులు మాత్రం కొనసాగుతున్నాయి.

# పారిశుద్ధ్య కార్మికురాలు పద్మకు రజనీకాంత్ సత్కారం



సూపర్ స్టార్ రజనీకాంత్ మరోసారి తన ఉదార స్వభావాన్ని, మంచి మనసును చాటుకున్నారు. నిజాయతీగా వ్యవహరించిన ఓ పారిశుద్ధ కార్మికురాలిని ఇంటికి పిలిచి స్వయంగా సత్కరించారు. ఆమె నిజాయతీని మెచ్చి ఓ బంగారు గొలుసును బహుమతిగా ఇచ్చి అభినందించారు. ఇందుకు సంబంధించిన ఫొటోలు ఇప్పుడు సోషల్ మీడియాలో వైరల్ అవుతున్నాయి.వివరాల్లోకి వెళితే, చెన్నైకి చెందిన పద్మ అనే మహిళ పారిశుద్ధ్య కార్మికురాలిగా పనిచేస్తున్నారు. ఈ నెల ప్రారంభంలో టీ నగర్‌లో విధుల్లో ఉండగా, ఆమెకు ఓ పర్సు దొరికింది. దాన్ని తెరిచి చూడగా, అందులో 45 సవర్ల (తులాల) బంగారు ఆభరణాలు ఉన్నాయి. ఏమాత్రం ఆశపడని పద్మ, వెంటనే తన పై అధికారులకు సమాచారం అందించి, ఆ బంగారాన్ని పాండీ బజార్ పోలీసులకు అప్పగించారు. పోలీసులు విచారణ జరిపి, ఆ ఆభరణాలను అసలు యజమానులకు అందజేశారు.పద్మ నిజాయతీ గురించి తెలిసి పలువురు ఆమెను ప్రశంసించారు. తమిళనాడు ముఖ్యమంత్రి ఎం.కె. స్టాలిన్ స్వయంగా ఆమెను అభినందించి, లక్ష రూపాయల చెక్కును బహుమతిగా అందించారు. తాజాగా ఈ విషయం తెలుసుకున్న సూపర్ స్టార్ రజినీకాంత్, మంగళవారం పద్మను తన నివాసానికి ఆహ్వానించారు. ఆమె నిజాయతీని ప్రశంసించి, ఓ బంగారు గొలుసును బహూకరించారు.పేదలకు కేవలం ఐదు రూపాయలకే పరోటాలు అమ్ముతున్న మధురైకి చెందిన తన వీరాభిమాని రజనీ శేఖర్‌ను కూడా రజనీకాంత్ కొన్ని రోజుల క్రితం ఇలాగే బంగారు గొలుసుతో సత్కరించిన విషయం తెలిసిందే.ఇక సినిమాల విషయానికొస్తే, రజనీకాంత్ ప్రస్తుతం నెల్సన్ దిలీప్‌కుమార్ దర్శకత్వంలో 'జైలర్ 2' సినిమా పనుల్లో ఉన్నారు. దీంతో పాటు, దర్శకుడు సిబి చక్రవర్తితో చేయబోయే సినిమా షూటింగ్ ఈ ఏడాది ఏప్రిల్‌లో ప్రారంభమవుతుందని ఆయన ఇటీవలే పొంగల్ పండుగ సందర్భంగా వెల్లడించారు. కమల్ హాసన్ నిర్మాణ సంస్థ రాజ్ కమల్ ఫిల్మ్స్ ఇంటర్నేషనల్ నిర్మిస్తున్న ఈ చిత్రానికి అనిరుధ్ సంగీతం అందిస్తున్నారు.

# రెయిన్ మ్యాన్ అంటూ ఆటపట్టించేవారు: మాధవన్

ఇటీవల 'ధురంధర్'లో కనిపించి ఆకట్టుకున్న నటుడు మాధవన్.. ఆ సినిమా షూటింగ్‌లో అందరూ తనను 'రెయిన్ మ్యాన్' అని పిలిచేవారని తెలిపారు. తాను ఎప్పుడు సెట్‌కు వెళ్లినా వర్షం పడేదని అందుకే అందరూ తనను అలా పిలిచేవారని చెప్పారు. ఆ సినిమాలో ఎక్కువ సన్నివేశాలు ఎండ లేకుండా తెరకెక్కించినవేనని.. అవే సినిమాకు మరింత అందానిచ్చాయని తెలిపారు. ఇకపోతే తన గ్యాప్‌పై ఆయన వివరాఉల పంచుకున్నారు. విశ్రాంతి అవసరం అనిపించి నాలుగేళ్లు విరామం తీసుకున్నట్లు నటుడు మాధవన్గ÷ప్పారు. 2011 నుంచి 2015 వరకూ విరామం తీసుకున్న ఆయన 2016లో 'సాలా ఖదూస్'తో తిరిగి అలరించడం ప్రారంభించారు. తాజాగా ఒక ఇంటర్వ్యూలో తన కెరీర్ గురించి పంచుకున్నారు.

'నేను చేస్తున్న పనిపై నిరాశ కలిగింది. అందుకే కొన్ని రోజులు విరామం తీసుకోవాలని భావించా. నాలుగేళ్లు చిత్ర పరిశ్రమకు దూరంగా ఉన్నాను. కనీసం ప్రకటనల్లో కూడా నటించలేదు. దేశంలో పర్యటించాను. గడ్డం పెంచుకొని చెన్నై చుట్టుపక్కల ప్రాంతాలతో పాటు భారత్‌లోని ఎన్నో అందమైన ప్రదేశాలకు వెళ్లాను. అక్కడ రిక్షా వాళ్ల దగ్గరనుంచి ప్రతిఒక్కరితో మాట్లాడాను. వాళ్ల జీవనశైలి, వారిని ఇబ్బందిపెట్టే విషయాల గురించి తెలుసుకున్నా. ఆ నాలుగేళ్ల పర్యటన నాకు జీవితంలో ఎన్నో పాఠాలు నేర్పింది' అని మాధవన్ అన్నారు. విరామం తర్వాత చేయాలనుకున్న పాత్రలపై మరింత స్పష్టత వచ్చిందని మాధవన్ అన్నారు. తాను తిరిగి వచ్చిన తర్వాత ఇండస్ట్రీలో కొందరు దర్శక నిర్మాతలకు



ముందుచూపు లేదని తెలుసుకున్నట్లు చెప్పారు. అప్పటి నుంచి కొత్త దర్శకులను వెతుకున్నట్లు వెల్లడించారు.

# 'మన శంకర వరప్రసాద్ గారు' ఓటీటీలోకి




ఈసారి సంక్రాంతి బరిలో మెగాస్టార్ సినిమా 'మన శంకర వరప్రసాద్ గారు' బ్లాక్ బస్టర్ గా నిలిచిన సంగతి తెలిసిందే. జనవరి 12న ప్రేక్షకుల ముందుకు వచ్చిన ఈ సినిమా బాక్సాఫీసు రికార్డులను కొల్లగొడుతూ భారీ కలెక్షన్లు రాబట్టింది. ఇప్పటి వరకు ఈ సినిమా కలెక్షన్లు రూ.400 కోట్ల మార్క్ ను చేరినట్లు సమాచారం. ప్రాంతీయ సినిమాల్లో అత్యధిక వసూళ్లు సాధించిన మూవీగా 'మన శంకరవప్రసాద్ గారు' రికార్డుల కెక్కింది. సినిమా విడుదలై మూడు వారాలు గడుస్తున్నా కలెక్షన్లు మాత్రం తగ్గలేదని తెలుస్తోంది. మెగాస్టార్ చిరంజీవి, అనిల్ రావిపూడి కాంబినేషన్ లో తెరకెక్కిన ఈ సినిమాకు మొదటి షో నుంచే మంచి టాక్ వచ్చింది. సాహు గారపాటి, సుష్మిత కొణిదెల సంయుక్తంగా నిర్మించిన ఈ సినిమాలో హీరోయిన్ గా నయనతార నటించింది. అతిథి పాత్రలో విక్టరీ వెంకటేశ్ కూడా ఈ సినిమాలో కనిపించారు.క్యాథరీన్ థెరీసా, సచిన్ ఖేడ్కర్, హర్షవర్ధన్, అభినవ్ గోమఠం, శరత్ సక్సేనా తదితరులు వివిధ పాత్రల్లో నటించారు. థియేటర్లలో బ్లాక్ బస్టర్ గా నిలిచిన 'మన శంకరవరప్రసాద్ గారు' సినిమా డిజిటల్ స్ట్రీమింగ్ హక్కులను జీ 5 సొంతం చేసుకుంది. ఈ నెల 11 నుంచి ఓటీటీలో స్ట్రీమింగ్ చేయనున్నట్లు తెలుస్తోంది. అయితే, దీనిపై ఇంకా అధికారిక ప్రకటన వెలువడలేదు.

**Printed by SREE SESHA SAI ENTERPRISES Published by KANDADI MAHENDER REDDY on behalf of KANDADI MAHENDER REDDY, printed at MEDCHAL MALKAJGIRI and published at Flat no.101, Ushodaya Towers, IDA Jeedimetla, Quthbullapur editor KANDADI MAHENDER REDDY, RNI NO ; TGTEL/25/A0880, CONTACT : 94906 17666, 9490617567**